# DD9 వార్త

వాస్తవాలు పలుకు

TE TL/26/A2635

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:109 | 01-09-2026 మంగళవారం | పేజీలు: 08 | వెల 3/-




6

## వీడిన మణుగూరు హత్య కేసు మిస్టరీ..

- కీలక పురోగతి సాధించిన పోలీసులు 23 మంది నిందితుల అరెస్టు -- ఖమ్మం సబ్ జైలుకు తరలింపు.






# పదవుల కోసం కాదు..
# ప్రజల కోసమే పార్టీ

## బంగారు తెలంగాణ కాదు.. బహుజన తెలంగాణ కావాలి"



- "కన్నీళ్లు వస్తున్నాయి.. కానీ నేను పిరికిదాన్ని కాదు"
- పాంచజన్య సంకల్ప సభలో కవిత భావోద్వేగ ప్రసంగం
- సొంత గడ్డపై కన్నీటి పర్యంతమైన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు

8

సొంత గడ్డపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ ఏర్పాటు చేసిన నాలుగు నెలల అనంతరం నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె ప్రసంగిస్తూ పలుమార్లు కన్నీళ్లు పెట్టుకున్నారు. తన సొంత ప్రజలను కలుసుకోవడం ఆనందంగా ఉందని చెబుతూనే, కుటుంబంలో చోటుచేసుకున్న పరిణామాలను గుర్తుచేసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కన్నీళ్లు తన బలహీనత కాదని, ప్రజల కోసం తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నిజామాబాద్,ఆగస్ట్ 31,(డిడి9 వార్త):




## అగ్రిస్టాక్ అమలులో తెలంగాణ భేష్

- తొలి మైలురాయి దాటినందుకు రూ.175 కోట్ల ప్రోత్సాహకం
- డిజిటల్ వ్యవసాయంలో రాష్ట్రం అగ్రగామి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 31 :

అగ్రిస్టాక్ ఆధారిత డిజిటల్ వ్యవసాయ వ్యవస్థ అమలులో రాష్ట్రం మరో కీలక మైలురాయిని సాధించింది. రైతులకు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందించేందుకు చేపట్టిన అగ్రిస్టాక్ ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థలో తొలి మైలురాయిని విజయవంతంగా దాటినందుకు కేంద్ర ప్రభుత్వం రూ.175 కోట్ల ప్రోత్సాహక నిధులు మంజూరు చేయడానికి ఆమోదం

మిగతా 2వ పేజీలో..



## 'చేయూత' దరఖాస్తులకు 15 రోజుల గడువు పెంపు

- మంత్రి సీతక్క ఆదేశాల మేరకు 15 వరకు దరఖాస్తుల స్వీకరణ
- కొనసాగుతున్న 'సర్' ప్రక్రియ, దివ్యాంగుల విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 31 :

చేయూత సామాజిక భద్రతా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం మరో 15 రోజులపాటు పొడిగించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగిస్తూ నిర్ణయం

మిగతా 2వ పేజీలో..



- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు
- ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్ రూమ్ ప్రారంభించండి
- సీనియర్ అధికారులతో వివిధ కమిటీల ఏర్పాటుకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు
- సమావేశానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హాజరు



## ప్రతిష్ఠాత్మకంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

హైదరాబాద్, ఆగస్టు 31 :

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను ప్రతిష్ఠాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. సమ్మిట్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రజా ప్రభుత్వం నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 ఏర్పాట్లపై ప్రజాభవన్‌లో సోమవారం ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. సమావేశానికి

మిగతా 2వ పేజీలో..

## గ్లోబల్ గ్రీన్ హబ్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయం

2

## ఇంటికో పండ్ల మొక్క..
## ఆరోగ్యానికి బంగారు బాట

- ఈరోజు నాటే చిన్న మొక్క రేపటి తరాలకు పెద్ద భరోసా
- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క

2



## సెమీ కండక్టర్ రంగంలో పెట్టుబడులు ప్రోత్సహించాలి

- 'తెలంగాణ-జర్మనీ' లాజిస్టిక్ కారిడార్ ఏర్పాటుకు సహకరించండి
- జీబీపీ ప్రతినిధులకు మంత్రి శ్రీధర్‌బాబు వినతి

2



## కృష్ణా నీటి దోపిడీపై సీఎం రేవంత్ మౌనం

- తెలంగాణకు తీరని ద్రోహం
- మన ప్రాజెక్టులు ఎండిపోతున్నాయ్
- కేఆర్ఎంబీ ప్రేక్షకపాత్ర
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు



2

# కృష్ణా నీటి దోపిడీపై సీఎం రేవంత్ మౌనం

**హైదరాబాద్, ఆగస్టు 31 :**

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా తరలిస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చోద్యం చూస్తున్నారని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు ధ్వజమెత్తారు. ఏపీ అడ్డగోలుగా నీటి దోపిడీకి పాల్పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నోరు మెదపకపోవడం తెలంగాణ రైతాంగానికి ద్రోహం చేయడమేనని మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రకటన విడుదల చేశారు. ఆ పోస్టులో రాష్ట్ర ప్రభుత్వం, కేఆర్ఎంబీ తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. నీటి కేటాయింపులు లేకున్నా వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి చోద్యం చూస్తూ తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోందని ఆరోపించారు. కృష్ణా బేసిన్‌లో భాగమైన బీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టులు ఎండిపోతుంటే మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా నీటిని తరలిస్తోందన్నారు. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జునసాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ.. ఇలా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తున్నదన్నారు. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారని నిలదీశారు. ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దీనిపై వెంటనే స్పందించాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

# 'చేయూత' దరఖాస్తులకు 15 రోజుల గడువు పెంపు

**మొదటిపేజీ తరువాయి**

తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా హైదరాబాదులో కొనసాగుతున్న 'సర్' ప్రత్యేక ప్రక్రియ కారణంగా పలువురు అర్హులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించలేకపోతున్నారని ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ముఖ్యంగా దివ్యాంగులు తమకు మరికొంత సమయం ఇవ్వాలని మంత్రి సీతక్కను కోరారు. ఈ విజ్ఞప్తులను సానుకూలంగా పరిగణించిన మంత్రి సీతక్క అర్హులైన ఒక్కరు కూడా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోకూడదని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి చేయూత పెన్షన్ దరఖాస్తుల గడువును మరో 15 రోజులపాటు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఇతర అర్హత కలిగిన పేద కుటుంబాల వారు సెప్టెంబర్ 15 వరకు తమ దరఖాస్తులను సమర్పించుకునే అవకాశం లభించింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సామాజిక భద్రతా పెన్షన్లు పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న భరోసా అని అన్నారు. అర్హత ఉన్న ఒక్క పేదవాడు, దివ్యాంగుడు సమాచారం లేకనో, ఇతర కారణాల వల్లనో ప్రభుత్వ సంక్షేమ పథకానికి దూరం కాకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. దివ్యాంగులు తమ సమస్యలను, ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారని, వారి అభ్యర్థనను మానవీయ కోణంలో పరిశీలించి గడువు పెంచామని తెలిపారు. గడువు పెంపును దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు, సిబ్బంది దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో ప్రజలకు పూర్తి సహకారం అందించాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# అగ్రిస్టాక్ అమలులో తెలంగాణ భేష్

**మొదటిపేజీ తరువాయి**

తెలిపింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆగస్టు 31న జారీ చేసిన లేఖలో రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన నివేదికను పరిశీలించి, నిర్దేశించిన ప్రమాణాలను పూర్తి చేసినట్లు ధ్రువీకరించింది. దీనితో స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (సాసి) 202627 కింద తెలంగాణకు ఈ నిధులు లభించనున్నాయి.

**అత్యంత పారదర్శకంగా పంపిణీ**

గతంలోనే ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసినందుకుగాను కేంద్రం తెలంగాణకు రూ.424 కోట్ల ప్రోత్సాహకం అందించగా, తాజాగా లభించిన రూ.175 కోట్లతో కలిపి రాష్ట్రానికి భారీగా నిధులు సమకూరాయి. అగ్రిస్టాక్ ద్వారా రైతుల వివరాలు, భూమి, పంటలు, ఎరువుల పంపిణీ డిజిటల్‌గా అనుసంధానం కావడం వల్ల నిజమైన రైతులకు లబ్ధి చేకూరడంతో పాటు ఎరువుల పక్కదారి పట్టకుండా సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల తెలిపారు.

**కేంద్ర కేటాయింపుల వివరాలు:**

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ నేడు జారీ చేసిన లేఖలో తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనను పరిశీలించి రాష్ట్రం నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలను పూర్తి చేసిందని పేర్కొంది. దీంతో 'సాసి' 202627లో భాగంగా రూ.175 కోట్ల ప్రోత్సాహకానికి తెలంగాణ అర్హత సాధించినట్లు కేంద్రం స్పష్టం చేసింది. సాసి' పార్ట్VII (డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) విభాగంలో మొత్తం రూ.13,000 కోట్లు కేటాయించగా, అగ్రిస్టాక్ ఆధారిత ప్రాధాన్య వినియోగ సందర్భాలు కోసం రూ.10,000 కోట్లు కేటాయించారు. అందులో అగ్రిస్టాక్ ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థ కోసం రూ.5,000 కోట్లు ప్రత్యేకంగా కేటాయించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను దేశంలోనే ముందంజలో ఉంచేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి కేంద్రం నుంచి వరుసగా లభిస్తున్న ఈ ప్రోత్సాహకాలు నిదర్శనమని అన్నారు.

# ఇంటికో పండ్ల మొక్క.. ఆరోగ్యానికి బంగారు బాట

**మహబూబాబాద్, ఆగస్టు 31 :**

ఈరోజు నాటే చిన్న మొక్క రేపటి తరాలకు పెద్ద భరోసా అవుతుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో సోమవారం నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఇంటి ఆవరణలో నాటుకునేందుకు పండ్ల మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, రామచంద్ర నాయక్, కేఆర్ నాగరాజులతో కలిసి మంత్రి సీతక్క మొక్కను నాటి వనమహోత్సవ ప్రాధాన్యతను వివరించారు. చెట్టు అంటే పచ్చదనం మాత్రమే కాదని, అది జీవం, స్వచ్ఛమైన గాలి, నీడ, ఆరోగ్యం అని ఆమె చెప్పారు. ఈ ఏడాది వనమహోత్సవంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో 6.18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే లక్ష్యంలో దాదాపు 91 శాతం మొక్కలు నాటడం పూర్తయిందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. అయితే మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని, నాటిన ప్రతీ మొక్క బతకాలని, ఎదగాలని, పెద్ద చెట్టుగా మారాలని మంత్రి సీతక్క అన్నారు. అప్పుడే వనమహోత్సవం నిజమైన అర్థంలో విజయవంతమవుతుందన్నారు.

# కాంగ్రెస్ కేడర్‌లో అసంతృప్తి జ్వాలలు

**మొదటిపేజీ తరువాయి**

**సిఫారసుల జాబితాలపై జాప్యం**

గాంధీభవన్‌లో ఇన్‌ఛార్జ్ మంత్రులు, డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో తరచూ సమావేశాలు జరుగుతున్నా క్షేత్రస్థాయిలో నిర్ణయాల అమలుకు వచ్చేసరికి జాప్యం కొనసాగుతోంది. పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన పాత కార్యకర్తలకు 70 శాతానికి పైగా నామినేటెడ్ పదవులు ఇవ్వాలనే ఉద్దేశాన్ని టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ పలుమార్లు వెల్లడించారు. అయితే నియోజకవర్గాల నుంచి ఆశావహుల పేర్లతో కూడిన సిఫారసు జాబితాలు సకాలంలో అందకపోవడం సమస్యగా మారిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**ఎవరికి పదవి ఇచ్చినా మరో వర్గం అసంతృప్తి**

చాలా నియోజకవర్గాల్లో ఒక్క పదవికి పలువురు నేతలు పోటీ పడుతున్నారు. ఎవరినైనా సిఫారసు చేస్తే మిగిలిన వర్గాలు అసంతృప్తికి గురై తమకు వ్యతిరేకంగా మారతాయనే ఆందోళన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జుల్లో కనిపిస్తోంది. దీంతో పేర్లను ఖరారు చేయడంలో జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. మరోవైపు బీఆర్ఎస్, ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతలకు ప్రాధాన్యం లభిస్తోందని, విపక్షంలో ఉన్న సమయంలో పార్టీ కోసం పోరాడిన పాత కేడర్ నిర్లక్ష్యానికి గురవుతోందనే భావన బలపడుతోంది.

**సమన్వయ లోపంతో మరింత సమస్య**

జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు, డీసీసీ అధ్యక్షులు, స్థానిక సీనియర్ నేతలు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కొరవడటం కూడా పదవుల భర్తీపై ప్రభావం చూపుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాల వారీగా ఆశావహుల పేర్లు పంపే సమయంలోనూ వర్గాల మధ్య పోటీ తీవ్రంగా ఉంటోంది. దీంతో పార్టీ నాయకత్వం ముందుకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమాచారం.

**కేడర్‌లో తగ్గుతున్న ఉత్సాహం**

విపక్షంలో ఉన్న సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు, వీధిపోరాటాలు నిర్వహించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో కీలకంగా పనిచేసిన కేడర్‌కు ఇప్పటికీ తగిన గుర్తింపు రాకపోవడం ప్రభావం చూపుతోంది. గ్రామ, మండల స్థాయిలో పార్టీ కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, రాజకీయ ప్రత్యర్థులపై ఎదురుదాడిలో గతంలో కనిపించిన చురుకుదనం తగ్గుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పదవుల భర్తీపై ఇకనైనా స్పష్టమైన నిర్ణయం తీసుకుని కష్టపడ్డ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేడర్ కోరుతోంది. అంతర్గత విభేదాలను పక్కనపెట్టి నామినేటెడ్ పోస్టుల భర్తీని వేగంగా పూర్తి చేయాలని, పార్టీ కోసం నిరంతరం పనిచేసిన నేతలకు సముచిత గుర్తింపు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే క్షేత్రస్థాయిలో పెరుగుతున్న నిరాసక్తత రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.

# సుస్థిర జల భద్రతకు ఉమ్మడి కార్యాచరణ

**హైదరాబాద్, ఆగస్టు 31 :**

దేశవ్యాప్తంగా సుస్థిర జలవనరుల నిర్వహణకు సమన్వయంతో కూడిన కార్యాచరణ రూపొందించే లక్ష్యంతో సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ సదస్సులో తెలంగాణ తన సమగ్ర జలభద్రత నమూనా(యూనిఫైడ్ వాటర్ సెక్యూరిటీ మోడల్)ను దేశం ముందుంచనుందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ జాతీయ సదస్సు నేపథ్యంలో సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సదస్సులో రాష్ట్రం తరపున సమర్పించనున్న ప్రజెంటేషన్‌లో పొందుపరచాల్సిన అంశాలు, రాష్ట్రంలో అమలవుతున్న జలసంరక్షణ కార్యక్రమాలు, గొలుసుకట్టు చెరువుల పరిరక్షణ, జలవనరుల జియోట్యాగింగ్, భూగర్భజలాల పర్యవేక్షణతోపాటు దేశవ్యాప్తంగా అనుసరించదగిన సమగ్ర జలభద్రత విధానంపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. దేశ జలభద్రతకు సంబంధించిన కీలక సవాళ్లపై కేంద్రం, రాష్ట్రాలు ఒకే వేదికపై చర్చించి భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేయనున్న నేపథ్యంలో ఈ సదస్సుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని మంత్రి పేర్కొన్నారు. జలవనరుల సంరక్షణ నుంచి ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరా వరకు వివిధ అంశాల్లోన్ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం సాధిస్తూ నిర్దిష్ట కాలపరిమితితో కూడిన జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని తెలిపారు.

# సెమీ కండక్టర్ రంగంలో పెట్టుబడులు ప్రోత్సహించాలి

**హైదరాబాద్, ఆగస్టు 31 :**



సెమీ కండక్టర్ తయారీ రంగంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా జర్మనీ కంపెనీలను ప్రోత్సహించాలని జర్మన్ ఇండియన్ బిజినెస్ అలయన్స్(జీబీఏ) ప్రతినిధులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. రాష్ట్రాన్ని సెమీ కండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. కెల్‌స్టర్‌బాక్ నగర మేయర్ మాన్‌ఫ్రెడ్ ఓకెల్ నేతృత్వంలో జీబీఏ ప్రతినిధులు సచివాలయంలో ఆయనను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో సెమీ కండక్టర్స్, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఆటోమొబైల్, ఆటోమేషన్ తదితర రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, అనుకూలతలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు వారికి వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, పెట్టుబడి ప్రోత్సాహకాలు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాల్లో పూర్తి సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. జర్మనీ కంపెనీల అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రెసిషన్ ఇంజినీరింగ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ సామర్థ్యాలను తెలంగాణలోని టాలెంట్ పూల్, ఇండస్ట్రీ ఎకోసిస్టమ్‌తో అనుసంధానం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రం నుంచి ఎగుమతులు జర్మనీ, యూరప్ మార్కెట్లకు సులభంగా చేరేలా ప్రత్యేక లాజిస్టిక్ కారిడార్ ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 7,8,9 తేదీల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026'పై జర్మనీ పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జీబీఏ చైర్మన్ సెల్వకుమార్ పెరియసామి, సీఈవో నిర్మల్ రామన్ కన్నయ్యన్, ఇన్నోవేషన్ హబ్ రైన్‌మెయిన్ సీఈవో స్టెఫాన్ విట్‌కిండ్ట్, ఎఫ్‌టీసీసీఐ ప్రతినిధులు కేకే మహేశ్వరి, శ్రీనివాస్ గరిమెళ్ల, వినోద్ కుమార్ అగర్వాల్, లోకేష్ ఫతేపురియా తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ గ్రీన్ హబ్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయం

- రాష్ట్ర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలో అందరి భాగస్వామ్యం
- 'గ్రీన్' అంటే ఖరీదైనదనే భావన మారాలి
- ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వార్షికోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి

**హైదరాబాద్, ఆగస్టు 31 :**

తెలంగాణ నవ యువ రాష్ట్రమైనప్పటికీ అత్యంత ఉన్నతమైన ఆశయాలు, స్పష్టమైన పర్యావరణ పారిశ్రామిక లక్ష్యాలతో ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ 25 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రాన్ని కేవలం దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాక కొరియా, జపాన్ వంటి అత్యంత అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలతో పోటీపడేలా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన ప్రకటించారు. తెలంగాణను ఆర్థికంగా, పారిశ్రామికంగా, సుస్థిర గ్రీన్ టెక్నాలజీలో ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు చేపడుతున్న ఈ ప్రయాణంలో పారిశ్రామికవేత్తలు, నిపుణులు, ప్రజలందరూ భాగస్వాములై తమ వంతు సహకారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను, పర్యావరణ అనుకూల పరిశ్రమలను ఆకర్షించడమే లక్ష్యంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ఒక బృహత్తర గ్లోబల్ సమ్మిట్‌ను డిసెంబర్ 7, 8 9 తేదీలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రపంచస్థాయి పెట్టుబడిదారులు, పారిశ్రామిక దిగ్గజాలు, సుస్థిర నిర్మాణ రంగానికి చెందిన నిపుణులు ఈ సదస్సులో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. పర్యావరణహిత నిర్మాణాలు కేవలం ఖరీదైన భవనాలు, విలాసవంతమైన అపార్టుమెంట్లకే పరిమితం కాకుండా సామాన్యుల ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, గృహ నిర్మాణాల్లోనూ భాగం కావాలని పిలుపునిచ్చారు. 'గ్రీన' అంటే ఖరీదైనదనే అపోహ మారాలని, సుస్థిర నిర్మాణాలు సమాజంలోని అందరికీ అందుబాటులోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు ఇప్పటివరకు ఎన్ని ఇళ్లు, కార్యాలయాలు, పరిశ్రమలు నిర్మించామన్న దానిపైనే ప్రధానంగా దృష్టి పెట్టేవారమని, కానీ ఇకపై ఏం నిర్మిస్తున్నాం.. భవిష్యత్ తరాలపై దాని ప్రభావం ఏమిటి అనే ప్రశ్నలు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



ఒక భవనం కేవలం కాంక్రీట్, ఉక్కుతో కట్టిన కట్టడం కాదు.. అది దశాబ్దాలపాటు విద్యుత్, నీటిని వినియోగిస్తూ, వ్యర్థాలను ఉత్పత్తి చేస్తూ ప్రజల జీవన విధానాన్ని ప్రభావితం చేస్తుంది అని చెప్పారు. అందువల్ల ఆర్కిటెక్ట్, ఇంజనీర్ తీసుకునే ప్రతి నిర్ణయం రాబోయే అనేక దశాబ్దాలకు పర్యావరణ నిర్ణయంగా మారుతుందన్నరు. గ్రీన్ బిల్డింగ్స్ అభివృద్ధికి అదనంగా చేర్చే ఫ్యాషన్ అంశం కాదని, మొదటి నుంచే సరైన పద్ధతిలో నిర్మించడమే దాని లక్ష్యమని స్పష్టం చేశారు. తక్కువ శీతలీకరణ అవసరమయ్యేలా భవనాలను రూపొందించడం, సహజ కాంతిని, నీటిని, విద్యుత్‌ను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా పర్యావరణంపై, ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థపై భారాన్ని తగ్గించవచ్చన్నారు. అత్యంత చౌక అయిన విద్యుత్ యూనిట్ అంటే మనం ఉత్పత్తి చేయాల్సిన అవసరం లేని విద్యుత్ యూనిట్ అని ఆయన అభివర్ణించారు.

**స్వచ్ఛమైన విద్యుత్ వైపు తెలంగాణ అడుగులు**

రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తున్న నగరాలు, పరిశ్రమలు, డేటా సెంటర్ల అవసరాలకు తగినట్లుగా సౌర, పవన, హైబ్రిడ్ పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తిపై ప్రభుత్వం దృష్టిసారించినట్లు చెప్పారు. సుస్థిర మౌలిక వసతుల ప్రయోజనాలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు కూడా చేరాలని ఆకాంక్షించారు. సరిగ్గా డిజైన్ చేయని భవనం ప్రారంభంలో చౌకగా కనిపించినా, భవిష్యత్తులో అధిక విద్యుత్, నీటి బిల్లుల రూపంలో మూల్యం చెల్లించాల్సి వస్తుందని, కాబట్టి భవనం జీవితకాల నిర్వహణ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. విద్యుత్ ఆదా చేయడం అంటే విద్యుత్ ఉత్పత్తి అవసరాన్ని తగ్గించడమేనని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్పిటల్స్, సామూహిక గృహ నిర్మాణాల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయడానికి ఐజీబీసీతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. సుస్థిర నిర్మాణాలను విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వం, పరిశ్రమలు, ఐజీబీసీ¾, విద్యా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

# ప్రతిష్ఠాత్మకంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

**మొదటిపేజీ తరువాయి**

సబ్ కమిటీ సభ్యులు, ఐటీపరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు హాజరయ్యారు. సమ్మిట్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన నిర్ణయాలు వేగంగా తీసుకునేలా ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా వార్ రూమ్ ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. దీని ద్వారా రోజువారీగా ఏర్పాట్ల పురోగతిని పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. సమ్మిట్ నిర్వహణకు అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్, ఇన్విటేషన్, హాస్పిటాలిటీ, ప్రోగ్రామ్ డిజైనింగ్, మీడియాకాంటాక్ట్ అండ్ కమ్యూనికేషన్, ఎంఓయూ కమిటీ తదితర కమిటీలు ఏర్పాటు చేసి సీనియర్ ఐఏఎస్‌లకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. సమ్మిట్ 2026కు ప్రత్యేకమైన లోగోను రూపొందించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసి వాటితో సమావేశాలు నిర్వహించి సమ్మిట్ కార్యాచరణపై చర్చించాలని తెలిపారు.

**ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమం**

సమ్మిట్‌కు విస్తృత అంతర్జాతీయ, జాతీయ ప్రచారం కల్పించడంలో భాగంగా అక్టోబర్ మొదటి లేదా రెండో వారంలో దేశ రాజధాని ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. విదేశీ దౌత్యవేత్తలు, కేంద్ర మంత్రులు, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న తెలంగాణ అధికారులు, ఇతర ప్రముఖులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సమ్మిట్‌పై ప్రింట్, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో హోర్డింగులు ఏర్పాటు చేసి సమ్మిట్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, వివిధ రంగాల్లో అభివృద్ధి అవకాశాలను ప్రచారంలో ప్రధానంగా ప్రదర్శించాలని తెలిపారు. సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ రోజువారీ పురోగతి నివేదికను రూపొందించి తనకు అందజేయాలని ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్‌ను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రతి కమిటీకి అప్పగించిన బాధ్యతలు, వాటి అమలు తీరు, పెండింగ్ అంశాలు, తీసుకోవాల్సిన తదుపరి చర్యలను నివేదికలో పొందుపరచాలని సూచించారు. తెలంగాణను పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా ప్రపంచానికి పరిచయం చేసేలా ఇన్వెస్ట్ సమ్మిట్ 2026ను నిర్వహించాలని, ఇందుకోసం అన్ని శాఖలు ఒకే లక్ష్యంతో సమన్వయంతో పనిచేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సమావేశంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫ్యూచర్ సిటీ సీఎండి శశాంక, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణభాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవల్లో ఆణిముత్యం

### జనని హాస్పిటల్ ప్రొప్రైటర్ డాక్టర్ రాజా గారికి తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్ కృతజ్ఞతలు



**ములుగు, ఆగస్టు 31డీ డీ 9 వార్త :**

ములుగు జిల్లా కేంద్రంలోని జనని ఆసుపత్రిలో పనిచేస్తున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజా వైద్య సేవలో ఆణిముత్యంగా వెలుగొందుతున్నారు. అతడు చేసిన సేవలను గుర్తించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్ ఆ డాక్టర్ని శాలువాతో సన్మానం చేశారు. దిలీప్ కుమార్ కుమారుడి ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన హెల్త్ బులెటిన్‌పై జనని హాస్పిటల్ ప్రొప్రైటర్ డాక్టర్ రాజా గారితో ఫోన్ ద్వారా మాట్లాడటం జరిగింది. అనంతరం హాస్పిటల్‌లో అవసరమైన వైద్య చికిత్స అందించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాజా గారు స్పందించి వైద్య సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్ ఈరోజు జనని హాస్పిటల్‌ను మర్యాదపూర్వకంగా సందర్శించి డాక్టర్ రాజా గారిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ములుగు జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఆజం షేక్ గారు కూడా పాల్గొని డాక్టర్ రాజా గారిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ, తన కుమారుడి ఆరోగ్య పరిస్థితి విషయంలో స్పందించి, అవసరమైన వైద్య సహకారం అందించిన డాక్టర్ రాజా గారికి మరియు జనని హాస్పిటల్ వైద్య సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో వైద్య సేవలు అందిస్తూ, మానవతా దృక్పథంతో స్పందిస్తున్న వైద్యులు మరియు వైద్య సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## మేడారం ఇంగ్లీష్ మీడియం సూర్య ఫోటో ఖాన్ అసోసియేషన్ కరాటే విద్యార్థులు

- డబ్లుఎఫ్ఎస్‌కెఓ సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్
- హుజురాబాద్ లో టైగర్ పంచ్
- కరాటే క్లబ్ నిర్వహణలో జరిగినటువంటి కరాటే పోటీలు బి బాబురావు మాస్టర్ ఆర్గనైజర్ ఆధ్వర్యంలో



**తాడ్వాయి DD9 వార్త**

హుజరాబాద్ కు కరాటే పోటీలకు విచ్చేసిన మేడారం ఇంగ్లీష్ మీడియం విద్యార్థినులు . సూర్య ఫోటో ఖాన్ కరాటే దు అసోసియేషన్ మాస్టర్ చందా హను మంతరావు శిక్షణ ఇచ్చి ఈరోజు జరిగినటువంటి పోటీలకు కట విభాగం విభాగంలో ఛాంపియన్షిప్ గెలుపొందిన ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ర్య చోటో ఖాన్ కరాటే దు అసోసియేషన్స్ డర్ టెక్నికల్ డైరెక్టర్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ కరాటే. యోగ కోచ్ పాయం సురేష్ శిక్షణలో పొందినటువంటి కరాటే మాస్టర్ చంద హనుమంతరావు పి ఎం శ్రీ మేడారం ఇంగ్లీష్ మీడియం విద్యార్థినులు ప్రతిభని సాధించారు. పి ప్రవళిక. ఏ సిరి చందన. ఏ సాత్విక. ఎం రక్షిత. ఏటూరు నాగారం పిఎంఆర్సి కాలేజ్ లో చదువుతున్న ద్వితీయ సంవత్సరం అమ్మాయి దోబె రక్షిత పాల్గొని తగు రజిత పథకాలను సర్టిఫికెట్లను ప్రథమ స్థాయిలో గెలు పొందినారు.

## దశ దిశ దినకర్మకు హాజరైన కాంగ్రెస్ నాయకులు



**తాడ్వాయిడిడి9 వార్త**

మేడారంలో మహమ్మద్ తాహెర్ పాష,మహమ్మద్ సాధిక్ అమ్మ మహమ్మద్ జమీలా మరణించగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి,50కేజీల బియ్యం,5000 వేల రూపాయలు అందించిన మేడారం సర్పంచ్ పీరీల భారతి–వెంకన్న మరియు పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో మేడారం సర్పంచ్ పీరీల భారతి–వెంకన్న,ఉప సర్పంచ్ ఆలకుంట వనిత–క్రిష్ణ,జిల్లా ప్రధాన కార్యదర్శి జాలపు అనంతరెడ్డి,సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్,మాజీ ఎంపీటీసీ బత్తిని రాజు గౌడ్,మేడారం గ్రామ కమిటీ అధ్యక్షులు గడిగ అనిల్ కుమార్,మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు అట్టం సమ్మయ్య,వార్డు మెంబర్ సిద్దబోయిన జనార్ధన్,అట్టం శైలజ–రమేష్,ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు జంగా వెంకటేష్ రెడ్డి,మండల నాయకులు ఎలగందుల బాబు రెడ్డి,జంగా సంతోష్ రెడ్డి,మల్లెల సత్యం,కొక్కెర పూర్ణ,మల్లెల కార్తీక్,మడప శ్రీకాంత్,మేడారం సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గజ్జెల రాకేష్ తదితరులు పాల్గొన్నారు

## వినాయక చవితి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

- శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలకు శంకుస్థాపన
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న గ్రామ పెద్దలు, భక్తులు
- సోమ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణ
- వైభవంగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు
- గ్రామస్థుల సమిష్టి సహకారం కోరిన ఆలయ కమిటీ

**వాజేడు,ఆగస్ట్ 21,(డిడి9 వార్త):**



సెప్టెంబర్ 14న వినాయక చవితి సందర్భంగా వాజేడు నాగారం గ్రామంలోని విద్యుత్ కార్యాలయ ప్రాంతం మెయిన్ రోడ్డు వద్ద శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తాత్కాలిక ఆలయ నిర్మాణానికి సోమవారం ఉదయం 10 గంటల 51 నిమిషాలకు శుభ ముహూర్తంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ శంకుస్థాపన కార్యక్ర మంలో గ్రామపంచాయతీ సర్పంచ్ బోదెబోయన స్వరూప,మండల పరిషత్ కార్యాలయ సూపరిండెంట్ మడుగూరు నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు సోమ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ, శ్రీ సిద్ధి వినాయక స్వామి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు గ్రామ ప్రజలందరూ సమిష్టిగా సహకరించాలని కోరారు. శంకుస్థాపన మహోత్సవం సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. రాబోయే నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, యువకులు, కమిటీ సభ్యులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు బోదెబోయన నానబాబు, ఆలం సీతారామయ్య, ఎట్టి పాపారావు, డాక్టర్ మద్దూరి మొగలి, దంతులూరు చిన సూర్య నారాయణ రాజు, పిట్ట సోరబాబు, పెనుమల్ల సంజీవరెడ్డి, పీర్ల రవీందర్, చిరుమర్తి శ్రీను, పెనుమల్ల వెంకటరెడ్డి, బత్తుల శ్రీనివాస్, పునేం రామ్మూర్తి, గౌరిబోయిన చంద్రయ్య, కందుల తిరుపతి, వెంకటేశ్వర్లు, కల్లూరు లక్ష్మయ్య, యాలం రామకృష్ణ, వాసం వెంకటేశ్వర్లు, కుదుముల చంటి, సుగంధపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పీఆర్ఓకు వినతి

**వెంకటాపురం, ఆగస్టు 31, డీ డీ 9 వార్త :**



వెంకటాపురం మండల పరిధిలోని మరికాల గ్రామపంచాయతీ లక్ష్మీనగరం గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ (TRP) ఆధ్వర్యంలో సంబంధిత సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ మేరకు TRP ములుగు జిల్లా అధ్యక్షులు తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్, ములుగు జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఆజం షేక్ గారితో కలిసి ఈరోజు పీఆర్ఓ గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనగరం గ్రామస్తులు తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై సంబంధిత రెవెన్యూ అధికారులు సమగ్రంగా విచారణ నిర్వహించి, ప్రభుత్వ రికార్డులను పరిశీలించి, వాస్తవాలు నిర్ధా రించాలని కోరారు. ప్రభుత్వ భూమి అనేది ప్రజా ప్రయోజనాలకు, ముఖ్యంగా పేదలు మరియు అర్హులైన ప్రజలకు ఉపయోగపడే విలువైన ఆస్తి అని, అది అనధికార ఆక్రమ ణలకు గురికాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని TRP నాయకులు పేర్కొన్నారు. విచారణలో ఆక్రమణలు లేదా ప్రభుత్వ భూమిపై అనధికార హక్కు/కబ్జా ఉన్నట్లు నిర్ధారణ అయితే, చట్టం ప్రకారం బాధ్యులపై తగిన కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని పీఆర్ఓ గారిని కోరారు. ప్రజల భూమి హక్కులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ మరియు అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రజల తరపున చట్టబద్ధమైన మార్గంలో పోరాడు తుందని తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో TRP ములుగు జిల్లా అధ్యక్షులు తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్, ములుగు జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఆజం షేక్ మరియు లక్ష్మీనగరం గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమై నేటికి 1000 రోజులు

- ప్రగతి భవన్ ముందు కంచె తొలగించి ప్రజా భవన్ గా మార్చి దొర అహంకారం దించి నేటికి1000 రోజులు

**తాడ్వాయి డిడి9 వార్త**

కేవలం జీతం కోసమే సంవత్సరానికి ఒకే ఒక్క సారి అసెంబ్లీకి వచ్చేలా చేసే ప్రభుత్వానికి నేటికి 1000 రోజులు

తనను భావి ముఖ్యమంత్రి అని జాకీలు పెట్టి మరీ లేపేలా చేయడానికి చిన్న దొర జీతగాళ్లకు నెలకు 9 కోట్ల రూపాయలు ఇచ్చేది కూడా 1000 రోజులు 3500 రోజులలో ఒక్క గ్రూప్ 1 నోటిఫికేషన్ కూడా వేయని దొర రాజ్యంలో, నోటిఫి కేషన్ వేసి పోస్టుల భర్తీ చేసింది కూడా ఈ వేయి రోజుల పాలనలోనే 3500 రోజుల్లో సుప్రీం కోర్టు కుక్క దొబ్బులు పెడితే ఒకే ఒక్క DSC నోటిఫివేషన్ వేసి, ఆ పోస్టులను భర్తీ చేయడానికి మరొక 600 రోజులు చేస్తే కేవలం ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలో DSC నిర్వహించి కేవలం 59 రోజులలో పోస్టులను భర్తీ చేసింది కూడా ఈ 1000 రోజుల పాలనలోనే 3500 రోజుల పాలనలో రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయడానికి 5 సంవత్సరాలు పట్టింది ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే2 లక్షల రుణమాఫీ పూర్తి చేసారు 3500 రోజుల పాలనలో పేదవాడి ఆరోగ్య భద్రత 5 లక్షలుంటే దాన్ని 10 లక్షలకు పెంచింది ఈ 1000 రోజుల ప్రజా పాలనలోనే 3500 రోజుల పాలనలో పట్టుమని పది రేషన్ కార్డులు ఇవ్వలేదు..డబుల్ బెడ్రూం ఇళ్లకు నోచుకోలేదు బర్రెలు గొర్రెలు స్కీమ్ అని స్కామ్ చేసి కోట్ల రూపాయలు దోచుకున్నారు, ఇక ఉద్యోగస్తుల జీతాలు మాట దేవుడెరుగు 1000 రోజుల ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు,ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగస్తులకు మొదటి తారీఖునే జీతాలు ఇంకా ఇవి 1/3 పాలనలోనే ఇంకా చాలా ఉన్నాయి.. మీ జీతగాళ్లకి, గొట్టం గాళ్లకు డబుల్ పేమెంట్ చేయకపోతే నడవదు

## తాగుడుకు బానిసై వ్యక్తి ఆత్మహత్య

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 31(డీడీ9 వార్త) :**

మద్యానికి బానిసై మనస్తాపంతో ఒక వ్యక్తి ఉరివే సుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోధన్ మండల పరిధిలోని ఏరాజ్ పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... ఏరాజ్ పల్లి గ్రామానికి చెందిన బనెల్లి నర్సయ్య (48) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన ఈ నెల 24న రాత్రి తన ఇంట్లో దూలానికి ఉరివే సుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను బోధన్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అదే రోజు రాత్రి నిజామాబాద్‌లోని మనోరమ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ నర్సయ్య సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య విమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## భద్రాచలంలో అదనపు సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయాలి

- 600కుపైగా సెషన్స్ కేసులు పెండింగ్.. హైకోర్టు న్యాయమూర్తులకు భద్రాచలం బార్ అసోసియేషన్ వినతి

**భద్రాచలం, ఆగస్టు 31 ( డిడి9 వార్త)**



భద్రాచలంలో అదనపు సెషన్స్ కోర్టు లేదా అసిస్టెంట్ సెషన్స్ కోర్టును ఏర్పాటు చేయడంతోపాటు సెషన్స్ కోర్టును భద్రా చలంలోనే ఏర్పాటు చేసి ప్రధాన కేంద్రంగా నిర్ణయించాలని భద్రాచలం బార్ అసోసియేషన్ హైకోర్టు న్యాయమూ ర్తులను కోరింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ హైకోర్టులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ జె. శ్రీనివాసరావు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీమపాక నగేష్, జస్టిస్ ఖాజా శరత్‌లకు బార్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. భద్రాచలం, మణుగూరు పోలీస్ సబ్ డివిజన్ల పరిధికి సంబంధించిన 600కుపైగా సెషన్స్ ట్రయల్ కేసులు వివిధ సెషన్స్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసుల విచారణ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో న్యాయవాదులు, కక్షిదారుల తోపాటు ముఖ్యంగా గిరిజన ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని వివరించారు. భద్రాచలంలోనే సెషన్స్ స్థాయి న్యాయస్థానం అందుబాటులో ఉంటే ప్రజలకు న్యాయం మరింత చేరువ కావడంతోపాటు సత్వర న్యాయం అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా భద్రాచలం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. న్యాయవాదుల హాలులో ఏసీలు ఏర్పాటు చేసుకు నేందుకు అనుమతులు మంజూరు చేయ డంతోపాటు పరిశుభ్రమైన క్యాంటీన్, జిరాక్స్ సదుపాయం, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు పరిపాలనా అనుమతులు ఇవ్వాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. భద్రాచలం ప్రాంతానికి ఉన్న ఆధ్యాత్మిక, చారిత్రక, భౌగోళిక, గిరిజన ప్రాధాన్యతను పరిగణనలోకి తీసు కోవాలని బార్ అసోసియేషన్ కోరింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1), ఐదవ షెడ్యూల్ పరిధిలోని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతంలో న్యాయవ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివా సాచారి, హైకోర్టు న్యాయవాదులు పీవీ కృష్ణమాచారి, ఏజీపీ జట్టి సాల్మన్ రాజు, సీనియర్ న్యాయవాది పోకల మోహన్ కృష్ణ, ముత్యాల ప్రవీణ్, బి. రామకృష్ణ, వలవల సురేష్ కుమార్, ఏ. రజని, దన్నాన తరుణ్ నాయుడు, హైమావతి, హైకోర్టు మాజీ వైస్ ప్రెసిడెంట్ కళ్యాణ్, మాజీ జీపీ నల్లమోతు రాము తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# శిరీషకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం

- తుడుందెబ్బ ఆదివాసి హక్కుల పోరాట సమితి ములుగు జిల్లా అధ్యక్షులు చందా మహేష్

**తాడ్వాయి డిడి9 వార్త**

తాడ్వాయి మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ యొక్క సమావేశంలో చందా మహేష్ తుడుందెబ్బ ములుగు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఉకే శిరీష ఆదివాసి కుటుంబంలో జన్మించి, కష్టపడి చదువుకొని, కుటుంబానికి అండగా నిలవాలనే ఆశయంతో ఉద్యోగ జీవితంలో అడుగుపెట్టిన ఆదివాసి ఆడబిడ్డ ఉకే శిరీష జీవితం అర్ధాంతరంగా ముగియడం తీవ్రంగా కలిచివేసిందని తుడుందెబ్బ ములుగు జిల్లా అధ్యక్షులు చందా మహేష్ అన్నారు. ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఉకే శిరీష హైదరాబాద్ పరిధిలోని తుక్కుగూడలో ప్రైమ్ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తూ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. ఉకే శిరీష మృతికి సంబంధించిన పూర్తి వాస్తవాలను ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వెంటనే వెలుగులోకి తీసుకురావాలి. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా, ఎవరి ప్రభావానికీ లోనుకాకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలి. బాధ్యులెవరైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు మేము పోరాడుతాం" అని చందా మహేష్ డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి షానాద్ ఉల్లా ఖాన్ అనే వ్యక్తి ప్రమేయంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, ఆ ఆరోపణలతో పాటు ఘటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని లోతుగా దర్యాప్తు చేయాలని ఆయన కోరారు. ప్రజల్లో వ్యక్తమవుతున్న అనుమానాలను నివృత్తి చేసే విధంగా పోలీసులు పారదర్శకంగా విచారణ జరిపి నిజానిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలని అన్నారు. ఒక ఆదివాసి కుటుంబం తమ కూతురిని ఎంతో కష్టపడి చదివించి, ఉద్యోగంలో స్థిరపడితే తమ కుటుంబానికి అండగా ఉంటుందని ఎన్నో కలలు కంటుంది. అలాంటి కుటుంబం ఇప్పుడు తమ బిడ్డ మృతికి న్యాయం చేయాలని పోరాడాల్సిన పరిస్థితి రావడం అత్యంత విషాదకరం. శిరీష మృతి కేవలం ఒక కుటుంబానికి జరిగిన నష్టం కాదు. ఇది యావత్ ఆదివాసి సమాజాన్ని కలచివేసిన ఘటన" అని చందా మహేష్ అన్నారు. ఆదివాసి ఆడబిడ్డలు చదువుకొని ఉద్యోగాల కోసం బయటకు వెళ్తున్న



సమయంలో వారి భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసి ఆడబిడ్డలకు ఎక్కడ భద్రత? ఉద్యోగం కోసం బయటకు వెళ్లిన మా ఆడబిడ్డలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఒక యువతి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందినప్పుడు నిజాలను బయటపెట్టి, బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలి" అని ఆయన అన్నారు. శిరీష కుటుంబం న్యాయం కోసం ఒంటరిగా పోరాడాల్సిన అవసరం లేదని, తుడుందెబ్బతో పాటు యావత్ ఆదివాసి సమాజం ఆ కుటుంబానికి అండగా నిలుస్తుందని చందా మహేష్ స్పష్టం చేశారు. శిరీష కుటుంబం ఒంటరిది కాదు. వారి వెనుక యావత్ ఆదివాసి సమాజం ఉంది. ఉకే శిరీషకు న్యాయం జరిగే వరకు మేము వెనక్కి తగ్గం. అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతాం" అని ఆయన స్పష్టం చేశారు.

### తుడుందెబ్బ ప్రధాన డిమాండ్లు

1. ఉకే శిరీష మృతిపై నిష్పక్షపాతంగా, సమగ్రంగా దర్యాప్తు చేయాలి.
2. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలి.
3. చట్టపరంగా బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
4. శిరీష కుటుంబానికి న్యాయం, తగిన ప్రభుత్వ సహాయం అందించాలి.
5. ఆదివాసి ఆడబిడ్డల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

ఈ కార్యక్రమంలో కొమరం కొమరం లక్ష్మీకాంత ఆదివాసి మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,వట్టం సురేష్, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి, తుడుందెబ్బ, చందా నవీన్, తాడ్వాయి మండల అధ్యక్షులు, తుడుందెబ్బ పాల్గొన్నారు.

# రోడ్డుపైనే నిర్మాణం.. స్తంభం తరలింపు యత్నం!

- చంద్రబాబు కాలనీలో నిబంధనల ఉల్లంఘనపై ఆరోపణలు
- రాంజీ తీరుపై కాలనీవాసుల ఆగ్రహం
- ప్రజా నాయకులంతా నా గుప్పిట్లోనే అంటూ బెదిరింపు ధోరణి?
- అధికారులు స్థల పరిశీలన చేయాలని డిమాండ్

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 31 (డీడీ9 వార్త):**

రహదారి హద్దులను ఆనుకుని భవన నిర్మాణం చేపడుతున్నారని.. అదే సమయంలో అక్కడి విద్యుత్ స్తంభాన్ని రహదారి వైపు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు చంద్రబాబు కాలనీలో కలకలం రేపుతున్నాయి. నిర్మాణం, విద్యుత్ స్తంభం కారణంగా రహదారి మరింత ఇరుకుగా మారితే పాఠశాల బస్సులు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం





చేశారు. నిర్మాణంపై ప్రశ్నించిన కాలనీవాసులతో సంబంధిత వ్యక్తి రాంజీ దురుసుగా మాట్లాడుతున్నారని వారు ఆరోపించారు. మున్సిపల్ అధికారులు, ప్రజా నాయకులతో తనకు పరిచయాలు ఉన్నాయని, వారు తన మాట వింటారనే విధంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. "అధికారుల అండ ఉందన్న ధీమాతో ప్రజా రహదారిని ఇరుకుగా చేసే హక్కు ఎవరికీ లేదు" అని కాలనీవాసులు స్పష్టం చేశారు. భవన నిర్మాణానికి మంజూరైన అనుమతులు, నిర్మాణ ప్లాన్, రహదారి హద్దులు, విద్యుత్ స్తంభం తరలింపునకు సంబంధించిన అనుమతులపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టినట్లు తేలితే వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, టౌన్ ప్లానింగ్, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన చేసి వాస్తవాలను తేల్చాలని కాలనీవాసులు కోరారు. ఎలాంటి పలుకుబడులు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రజా రహదారిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కాలనీవాసులు తోకల మల్లయ్య, రఫీక్, ఆనంద్, నరేష్, సంజీవ్, నారాయణ, రామ్మోహన్ తదితరులు ఈ మేరకు డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ దశలవారీగా ఇళ్లు: తొట్ల తిరుపతి యాదవ్

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 31 (డీడీ9 వార్త):**

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను సోమవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన లబ్ధిదారులు దొడ్ల సంతు–లావణ్య, వేముల తిరుపతి–లావణ్య కుటుంబాలకు మంజూరైన ఇళ్లను మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజల సొంతింటి కలలు సాకారమవుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మించి ఇస్తామని స్పష్టం చేశారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎల్లే రామ్మూర్తి, సర్పంచ్, ఉపసర్పంచ్ కాస్ప మహేందర్, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, నాయకులు ఒర్రె సది, రేండ్ల కృష్ణమూర్తి, కల్వచర్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# సుదీర్ఘ సేవలకు ఘన సన్మానం

- పదవీ విరమణ పొందిన ముగ్గురు ఉద్యోగులకు ఆర్జీ–1 ఏరియా జీఎం అభినందనలు

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 31 (డీడీ9 వార్త):**



సింగరేణి సంస్థలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ముగ్గురు ఉద్యోగులను రామగుండం ఏరియా–1 జీఎం కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. నాగేశ్వరరావు, ఏజీఎం రాజాజీ, ఏజీఎం బరుపటి పార్వతి, ఎస్టేట్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్ అటెండర్‌గా సేవలందించారు. జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి ఆర్జీ–1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి అభివృద్ధిలో ఉద్యోగుల కృషి కీలకమని అన్నారు. సంస్థలో ఎన్నో ఏళ్లపాటు అంకితభావం, నిబద్ధతతో పనిచేసి పదవీ విరమణ పొందుతున్న వారి సేవలు అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, కొత్త అధ్యాయానికి ఆరంభమని పేర్కొన్నారు. ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా, ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు తమ సుదీర్ఘ ఉద్యోగ అనుభవాలను, సహచరులతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సంస్థలో పనిచేసే అవకాశం కల్పించిన యాజమాన్యానికి, సహకరించిన అధికారులు, సహచర ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీఎం క్వాలిటీ జే. వెంకటరమణ, ఎస్‌వోటు జీఎం చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీఎంఓఏఐ ప్రతినిధి సీహెచ్. రాజన్న, ఏఐటీయూసీ గుర్తింపు సంఘం జీఎం కార్యాలయ ప్రతినిధి బి. పద్మ, ఏజెంట్ 11 గ్రూప్ చిలుక శ్రీనివాస్, అధికారులు, పర్సనల్ అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, సహచరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత



**ములుగు, ఆగస్టు 31: (డిడి9 వార్త)**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ, సమస్యలను నిర్ణీత గడువులోపు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి వి. రవికుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్వో వి. రవికుమార్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 33 దరఖాస్తులు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 14, ఇందిరమ్మ ఇళ్లకు 4, పెన్షన్లకు 2, ఇతర శాఖలకు సంబంధించిన 13 దరఖాస్తులు ఉన్నాయి.ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు డీఆర్వో తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆర్జీ–1, జీడికే–11ఏ గనిలో రూఫ్ ఫాల్

## కార్మికులకు ఎలాంటి హాని లేదు.. కంటిన్యూయస్ మైనర్ సురక్షితంగా బయటకు

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 31 (డీడీ9 వార్త):**



సింగరేణి ఆర్జీ–1 ఏరియా పరిధిలోని జీడీకే–11ఏ గనిలో ఆదివారం రెండో షిఫ్టులో రూఫ్ ఫాల్ సంఘటన చోటుచేసుకుంది. రాత్రి సుమారు 7 గంటల సమయంలో కంటిన్యూయస్ మైనర్–1 ప్యానెల్‌లో కంటిన్యూయస్ మైనర్ పనిచేస్తున్న ప్రాంతంలో బొగ్గు పైకప్పు కూలినట్లు సింగరేణి యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

**కార్మికులు ఎవరూ లేని ప్రాంతంలో ఘటన**

సంఘటన జరిగిన ప్రాంతంలో ఎలాంటి కార్మికులు, ఇతర వ్యక్తులు లేరని యాజమాన్యం స్పష్టం చేసింది. కంటిన్యూయస్ మైనర్‌ను ఆపరేటర్ సురక్షిత ప్రాంతంలో ఉండి రిమోట్ కంట్రోల్ ద్వారా నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. భౌగోళిక ఒత్తిడితో సహజంగా రూఫ్ ఫాల్ సపోర్టులు లేని గోఫ్ ప్రాంతంలో కంటిన్యూయస్ మైనర్ పనిచేసే సమయంలో గోఫ్‌లో ఏర్పడే భౌగోళిక ఒత్తిడి కారణంగా బొగ్గు రూఫ్ అప్పుడప్పుడు సహజంగా కూలిపోయే అవకాశం ఉంటుందని యాజమాన్యం వివరించింది. ఈ సంఘటన కూడా అదే విధంగా చోటుచేసుకున్నట్లు తెలిపింది. భద్రతా చర్యల్లో భాగంగా అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో కంటిన్యూయస్ మైనర్‌ను సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్లు పేర్కొంది. సంఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని, గనిలో బొగ్గు ఉత్పత్తి యథావిధిగా కొనసాగుతోందని సింగరేణి ఆర్జీ–1 యాజమాన్యం వెల్లడించింది.

# రూ.5 లక్షల ఎల్ ఓసీ అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు.ఆగస్టు 31(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం గ్రామానికి చెందిన యానబోయిన రాజేశ్వరికి వైద్య చికిత్స నిమిత్తం రూ.5 లక్షల విలువైన ఎల్‌ఓసీ (LOC) మంజూరైంది. ఈ మేరకు మంజూరైన ఎల్‌ఓసీని సోమవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె కుమారుడు యానబోయిన సాంబశివరావుకు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న వైద్య సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. యానబోయిన రాజేశ్వరి త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతం చేయాలి

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 31(డీడీ9 వార్త) :**

రాష్ట్రంలో చేపడుతున్న వివిధ రైల్వే ప్రాజెక్టుల పురోగతికి వీలుగా భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. రైల్వే లైన్ల విస్తరణ, డబ్లింగ్ పనులపై సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణంలో అనవసర జాప్యం జరగకుండా భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భూ బాధితులైన రైతులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణి అవలంబించాలని సూచించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.. నిజామాబాద్ శివారు బైపాస్ రైల్వే లైన్ భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందన్నారు. ముద్ఖేడ్ – మేడ్చల్ డబ్లింగ్ పనుల భూసేకరణకు సంబంధించి జిల్లాలో ఎలాంటి అడ్డంకులు లేవని సీఎస్‌కు వివరించారు.

## అశ్వాపురం మండల కేంద్రంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలి..

**ప్రజావాణిలో దరఖాస్తు చేసిన మాల జెఏసి నాయకులు చెట్టి సురేష్.**

**మణుగూరు.ఆగస్టు 31(డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండల కేంద్రంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని కోరుతూ దళిత సంఘాల నాయకులు, ప్రజలు సోమవారం నాడు నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. ఈ మేరకు అశ్వాపురం మండల ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. అశ్వాపురం మండలంలో దళితుల జనాభా గణనీయంగా ఉందని, వివాహాలు, సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రత్యేకంగా కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో దళిత కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు తెలిపారు.దళితుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి త్వరితగతిన ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు వల్ల మండలంలోని దళిత కుటుంబాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, సామాజిక కార్యక్రమాలకు అనువైన వేదిక అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేకల భాస్కర్, ఉండేటి రాజేష్, జూపల్లి ధ్రువ కుమార్, కరకపల్లి దేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## 24 ఏండ్లవిద్య సేవలకు ఘన వీడ్కోలు....

- **జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు ,...ఉత్తమ ప్రధానోపాధ్యాయులు.. రేపాల నరసింహస్వామి..**
- **తెలంగాణ టీచర్స్ యూనియన్ ములుగు జిల్లా అధ్యక్షుడు సర్వర్ అహ్మద్**



**ములుగు జిల్లా వెంకటాపురం( నూగురు,), డీ డీ 9 వార్త :**

మండలంలోని ప్రాథమిక పాఠశాల రంగరాజపురం కాలనీ లో ప్రధానోపాధ్యాయులు (ఎల్ ఎఫ్ ఎల్ )రేపాల నరసింహస్వామి పదవి విరమణ కార్యక్రమం సభాధ్యక్షులు ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సూర్య నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మహమ్మద్ సర్వ అహ్మద్ తెలంగాణ టీచర్స్ యూనియన్ ములుగు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. నరసింహ స్వామి ఉపాధ్యాయ వృత్తిలో 24 సంవత్సరాలు గా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విశిష్ట సేవలందించిన నరసింహ స్వామి పదవి విరమణ సందర్భంగా సోమవారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఉమ్మడివరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు, జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు గా ఎన్నో అవార్డులు అందుకున్న నరసింహ స్వామి విద్యా సేవలను పలువురు వక్తలు విద్యాతో పాటు క్రమ శిక్షణ, విలువలు సామాజిక బాధ్యతలను విద్యార్థుల్లో పెంపొందించడంలో ఆయన చేసిన కృషి ఆదర్శనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేశ్వరి ఉపసర్పంచ్ వెంకటేశ్వరరావు, బి శ్రీనివాస్, టిటియు జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు రాజమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోశెట్టి రామారావు, జిల్లా కార్యదర్శి,పర్వతాల బిక్షపతి, అబ్బు శ్రీనివాస్, అమీర్ శెట్టి సారంగపాణి, శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్, వెంకటస్వామి, రాంబాబు, కే .నరసింహ చారి, ఈ కార్యక్రమానికి రవి బాలాజీ ఉపాధ్యాయులు, వ్యాఖ్యాతగా వ్యవహరించారు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు మహిళా సంఘాలు, యువజన సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ క్రమశిక్షణే ముఖ్యం.. బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యం..

**ఆగస్టు31 డిడి9 వార్త**
**వెంకటాపురం.**



బీఆర్ఎస్ అధినేత, గులాబీ బాస్ కె.చంద్రశేఖర్‌రావు (కేసీఆర్), పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనల మేరకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్న బీఆర్ఎస్ సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెంకటాపురం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గంప రాంబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ ప్రజా ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. అందరినీ కలుపుకొని ఐక్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గొడవర్తి నర్సింహమూర్తి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులు, నిరుద్యోగులు, రైతు కూలీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకపోతే ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దశలవారీగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ సమరభేరిని విజయవంతం చేసి పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో కృషి చేయాలని మండల అధ్యక్షుడు గంప రాంబాబు కోరారు.

# కాంగ్రెస్ హామీలపై బీజేపీ పోరుబాట

- **ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం: సోమారపు లావణ్య**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 31 (డీడీ9 వార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సోమారపు లావణ్య ఆరోపించారు. ఇకపై ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిత్యం ప్రశ్నిస్తూ, హామీల అమలుకు బీజేపీ తరపున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. గోదావరిఖని శివాజీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసిపేట శివాజీతో కలిసి ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీలు, వివిధ డిక్లరేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. మూడు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చామని, ఇకపై హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ వెంటాడుతుందని లావణ్య స్పష్టం చేశారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని ఆరోపించారు. రామగుండం ప్రాంతంలో పాలన ఎలా ఉన్నా కూల్చివేతల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆమె విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరిస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని



హెచ్చరించారు. హామీలు, ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు ప్రతిరోజూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు ఐతే పవన్, మిట్టపల్లి సతీష్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మామిడి రాజేష్, జిల్లా మాజీ ఉపాధ్యక్షురాలు మాతంగి రేణుక, జిల్లా మాజీ కార్యదర్శి జక్కుల నరహరి, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సుజన శ్రీ, రజిత, చల్ల శోభారాణి, సీనియర్ నాయకులు దాసరి శ్రీనివాస్, మారపెల్లి శ్రీనివాస్, ఎతిరాజ్ సురేష్, బూడిద రమేష్, పంగ రవి, పొట్ల వెంకటేశ్, సిలివేరి అంజి, అరిగెల శ్రావణ్, అంకం తిరుపతి, మెరుగు శ్రీనివాస్, మంథిని మహేశ్, రోడ్డ శివ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం..

- **ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు.ఆగస్టు 31(డి డి 9వార్త)**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదలకు కొండంత అండగా నిలుస్తుందని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మణుగూరు మండలంలోని విఠల్ రావు నగర్‌లో లబ్ధిదారులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన గృహాలను సందర్శించి, లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ఎంతోమంది ఇల్లు లేని నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన శ్రీమతి రావుల పరిమిళ, శ్రీమతి బిజిగి కోటేశ్వరి, శ్రీమతి గంగిశెట్టి ఎల్లమ్మ మరియు వారి



కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆత్మీయంగా అభినందించారు. నూతన గృహాల్లో వారు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టౌన్ అధ్యక్షులు, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులు, మైనారిటీ విభాగం అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఊకే శిరీష మృతదేహానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ నివాళులు...

- **అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు పరామర్శ.. ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే...**

**అశ్వారావుపేట:ఆగస్టు 31(డిడి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఊకే శిరీష మృతి పట్ల అశ్వారావుపేట శాసనసభ్యులు గౌరవ శ్రీ జారె ఆదినారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శిరీష మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. శిరీష మృతితో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. జరిగిన ఘటన పట్ల విచారం వ్యక్తం చేస్తూ, శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం చౌటుగూడెం గ్రామంలో నిర్వహించిన శిరీష అంత్యక్రియల్లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అంతిమ కార్యక్రమాల్లో



పాల్గొని శిరీషకు తుది నివాళులు అర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**కుటుంబానికి అండగా ఉంటామని భరోసా...**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ.. ఊకే శిరీష మృతి ఎంతో బాధాకరమని అన్నారు. చిన్న వయసులోనే మృతి చెందడం కుటుంబ సభ్యులకు, బంధువులకు, గ్రామస్తులకు తీరని లోటని పేర్కొన్నారు. ఆ కుటుంబం ఎదుర్కొంటున్న బాధను తాను అర్థం చేసుకుంటున్నానని, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని సూచించారు. ప్రజల కష్టసుఖాల్లో తాను ఎల్లప్పుడూ భాగస్వామిగా ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే, సాధ్యమైనంత మేరకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

**గ్రామంలో విషాదఛాయలు**

ఊకే శిరీష మృతితో చౌటుగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో



తరలివచ్చి శిరీష మృతదేహానికి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబానికి అండగా నిలవడం పట్ల స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు, శిరీష కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొని తుది నివాళులు అర్పించారు.

## నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయండి..

**బిఆర్ఎస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు.**

**మణుగూరు.ఆగస్టు 31(డి డి 9వార్త)**

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చి ఇప్పటికి 1000 రోజులు దాటినా.. ఏదో తూతూ మంత్రంగా ఫ్రీ బస్సు అంటూ, రైతు రుణమాఫీ అంటూ నిరుద్యోగులకు, రైతులకు, మహిళలకు, వికలాంగులకు, అన్యాయం చేసారు అని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు టౌన్ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్ లు ఆరోపించారు. సోమవారం నాడు మణుగూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రభుత్వం వచ్చి 1000 రోజులు అయిన




సందర్భంగా సంబరాలు చేసుకోవడం సిగ్గు చేటు అని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచడానికి భారతీయ రాష్ట్ర సమితి పార్టీ కార్యనిర్వహణ అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు సెప్టెంబర్ 2 నుంచి 8వ తారీకు వరకు అన్ని జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారని, కేటీఆర్ ఆదేశాల మేరకు రేపటి నుండి జరగబోయే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు. పార్టీ కార్యకర్తలు, మహిళ నాయకురాళ్లు, యువజన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలి అని అన్నారు. ఈ కార్యక్రమాల కోసం ప్రతి రోజు ఉదయం 10 గంటల కల్లా BRS పార్టీ ఆఫీస్ వద్దకు అధిక సంఖ్యలో హాజరై ఈ నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయవలసిందిగా మణుగూరు BRS నాయకులు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో మణుగూరు మండల BRS పార్టీ అధ్యక్షులు మరియు సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరావు, మణుగూరు టౌన్ అధ్యక్షులు కుంట లక్ష్మణ్, మణుగూరు మండల మాజీ జడ్పిటిసి పోశం నర్సింహారావు, నూకారపు రమేష్, ముత్యం బాబు, అడపా అప్పారావు, ఎడ్ల శ్రీనివాస్, ముదంగుల కృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షులు వేల్పుల సురేష్, వద్లూరి రాంబాబు, కేతా అప్పాజీ, షేక్ మౌలానా, జావీద్ పాషా, దర్శనాల శ్రీనివాస్, పడుతూరి విక్రమ్ మేకల రవి,మహిళా నాయకురాలు సుజాత, శారద, కరీనా బేగం, మణుగూరు మండల యువజన అధ్యక్షులు బోశెట్టి రవి, టౌన్ అధ్యక్షులు గుర్రం సృజన్, పద్దం శ్రీనివాస్, జక్కం రంజిత్,ఆవుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠకు శ్రీకారం..

**భక్తుల సహకారానికి నిర్వాహకుల పిలుపు..**

**ఆగస్టు 31, డీడీ9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురం మహాలక్ష్మిగుడి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠను ఘనంగా నిర్వహించేందుకు భక్తులు, గ్రామ పెద్దలు సన్నాహాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద నిర్వాహకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆలయ పునఃప్రతిష్ఠాపన కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, కార్యక్రమ నిర్వహణ, ఆలయ నిర్మాణ పనులు, విరాళాల సేకరణ తదితర అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న ముత్యాలమ్మ ఆలయం భూమికి లోతుగా ఉండటంతో భారీ వర్షాల సమయంలో నీరు ఆలయంలోకి ప్రవహిస్తోందని నిర్వాహకులు తెలిపారు. అలాగే ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఆలయ ఆవరణలో సరైన స్థలం లేక భక్తులు మొక్కులు చెల్లించుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని భక్తుల సౌకర్యం, ఆలయ అభివృద్ధి, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి భక్తులు తమ వంతు సహాయ సహకారాలు, విరాళాలు అందించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. భక్తులందరి సహకారంతో శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠను వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై, గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.




# బీఆర్ఎస్‌ను విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ మహిళా విభాగానికి లేదు

- **మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**
- **ముందు హామీలు నెరవేర్చాలి.. ఆ తర్వాతే బీఆర్ఎస్‌పై విమర్శలు చేయాలి: బీఆర్ఎస్ మహిళా నేతలు**

**భద్రాచలం, ఆగస్టు 31 డిడి9 వార్త**



బీఆర్ఎస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ మహిళా విభాగం నాయకులకు లేదని బీఆర్ఎస్ భద్రాచలం మండల మహిళా నాయకులు అన్నారు. సోమవారం భద్రాచలం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ మహిళా నాయకుల వ్యాఖ్యలను వారు ముక్తకంఠంతో ఖండించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మహిళా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మహిళలకు పలు హామీలు ఇచ్చిందని, అయితే వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని ప్రకటించిన హామీని కూడా ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ హామీని నెరవేర్చకుండా పథకాన్నే నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని వారు ఆరోపించారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఇందుకోసం ఆ పార్టీ నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. మహిళలంటే అన్ని రాజకీయ పార్టీలకు గౌరవం ఉండాలని, మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటం బీఆర్ఎస్ పార్టీ విధానం కాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకులు కావూరి సీతా మహాలక్ష్మి, ఎం.డి. ముంతాజ్, గంపల రవికుమారి, తెల్లం కామేశ్వరి, మాదారి, ఏనిక శిరీష, ఏలూరి ప్రియాంక, రహిమున్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# వీడిన మణుగూరు హత్య కేసు మిస్టరీ..

- **కీలక పురోగతి సాధించిన పోలీసులు**
- **23 మంది నిందితుల అరెస్టు -- ఖమ్మం సబ్ జైలుకు తరలింపు.**

**మణుగూరు.ఆగస్టు 31(డి డి 9వార్త)**

సంచలనం సృష్టించిన మణుగూరు నేతాజీ గ్రౌండ్ లో జరిగిన హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. కేసులో మొత్తం 27 మంది నిందితులను గుర్తించిన పోలీసులు, వారిలో 23 మందిని సోమవారం నాడు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సోమవారం నాడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. మణుగూరు గాంధీ బొమ్మ సెంటర్ కు చెందిన సింహాద్రి శివ కుమార్ @ శివ గత నాలుగేళ్లుగా హైదరాబాద్ లో ఇంటీరియర్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. మణుగూరు కు చెందిన కొందరు యువకులు అతని వద్ద పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో సతీష్ తో లోకేష్ కు జరిగిన గొడవలో శివ జోక్యం చేసుకుని గొడవను అపినట్లు మృతుడి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారని ఆయన తెలిపారు.

ఈ ఘటనను మనసులో పెట్టుకున్న కొందరు వ్యక్తులు శివ, సతీష్ లను ఫోన్ లో బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఆగస్టు 27 న హైదరాబాద్ నుండి మణుగూరు వచ్చిన శివ తన స్నేహితుడు ఉదయ్ కుమార్ తో కలిసి నేతాజీ గ్రౌండ్ కు వెళ్ళగా, అప్పటికే అక్కడ ఉన్న పలువురు వ్యక్తులు పథకం ప్రకారం అతనిపై మూకుమ్మడిగా దాడి చేసి హత్య చేసినట్టు శివ తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారని, ఈ పిర్యాదు మేరకు మణుగూరు పోలీసు స్టేషన్లో క్రైమ్ నంబర్ 309/2026, బిఎన్ఎస్ సెక్షన్లు 189(2), 103(2), 109(1), 351(3), 61(2), రీడ్ విత్ 190 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు.

**నిందితుల్లో 23 మంది అరెస్టు**

దర్యాప్తులో భాగంగా పోలీసులు మొత్తం 27 మంది నిందితులను గుర్తించారు. వారిలో 23 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 9 ద్విచక్ర వాహనాలు,20 సెల్ ఫోన్లు, ఒక చేతి కడియం, ఒక కర్ర స్వాదీనం చేసుకున్నామని, అరెస్టు చేసిన వారిని కోర్టులో హాజరుపరచి రిమాండ్ కు తరలించారు. మరో నలుగురి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అరెస్టయిన వారిలో జెట్ పట్ రమాకాంత్ @ రమ్మీ @ జెట్టీ, కందుల దినేష్,చెన్నబోయిన భరత్ @ సిహెచ్, తొలెం జంపయ్య @ పండు, రాయల వినయ్, మహమ్మద్ సాధిక్, నెట్టెం వరప్రసాద్, గణిబోయిన సాత్విక్ @ చింటు, గుగులోత్ రమేష్ @ గోబి, కొండ్రు గణేష్, నక్క రాజా @ విక్కీ, కంగాల సాయి జగన్ @ జగన్, ఎదలపల్లి నాగేంద్రబాబు @ కన్ని, కొమెర చంటి, ఎనిక దినేష్, పున్నం వంశీ శివ @ శివ, కొమరం హరీష్ @ డాన్, ఇర్ప శ్రావణ్, కలబోయిన మల్లేష్, దేవళ్ళ దుర్గాప్రసాద్, అక్కిరెడ్డి అభినయ్ రెడ్డి @ అభి, సోయం నరసింహారావు @ రేకుల్, ఈర్ల లోకేశ్వర్ @ లోకేష్ ఉన్నారు.



అరెస్టయిన నిందితుల్లో కొందరిపై గతంలోనూ మణుగూరు పోలీసు స్టేషన్లో కేసులు నమోదయ్యాయి అని పోలీసులు తెలిపారు. జెట్ పట్ రమాకాంత్ పై పేకాట కేసు,చెన్నబోయిన భరత్ పై రెండు కొట్లాట కేసులు, కందుల దినేష్ పై రెండు కొట్లాట కేసులు, గణిబొయిన సాత్విక్ పై డికాయిటి కేసు,గుగులోత్ రమేష్ పై పేకాట కేసు, కొండ్రు గణేష్ పై రెండు ఫోక్సో కేసులు నమోదు అయి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**గ్యాంగ్ స్టర్ లకు పోలీసుల హెచ్చరిక**

మణుగూరు లో ఎవరైనా, ఏ పేరుతో అయినా గ్యాంగులు ఏర్పాటు చేసి సెటిల్మెంట్లు చేస్తూ, అల్లర్లు సృష్టిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి గ్రూపులు, గ్యాంగుల సమాచారం తెలిసినట్లైతే పోలీసువారికి సమాచారం అందజేయాలని సూచించారు.సమాచారం అందజేసే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు.గ్యాంగుల పేరుతో యువతను తప్పు దోవ పట్టిస్తూ,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.గ్యాంగులు ఏర్పాటు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సోమవారం నాడు అరెస్ట్ చేసిన 23 మంది నిందితులను మణుగూరు పోలీస్ స్టేషన్ నుండి ఖమ్మం సబ్ జైలుకు తరలించారు.నిందితులను తరలించే సమయంలో స్టేషన్ ఎదుట భారీగా ప్రజలు గుమిగూడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో మణుగూరు పోలీసు సబ్ డివిజనల్ అధికారి రవీందర్ రెడ్డి, సిఐ నాగబాబు, ఎస్సైలు నగేష్, రవూఫ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాథమిక విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు అభినందనీయం

- **రంగనాయకులగుట్ట పాఠశాలను సందర్శించిన ఎంఈవో బెక్కంటి శ్రీనివాసరావు**

**భద్రాచలం, ఆగస్టు 31 (డిడి9 వార్త)**

భద్రాచలంలోని రంగనాయకులగుట్ట ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈవో బెక్కంటి శ్రీనివాసరావు ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల ఆవరణలోని ఆహ్లాదకరమైన వాతావరణం అందరినీ ఆకట్టుకుంటోందని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి అభ్యసన సామర్థ్యాలు, అంతర్గత ప్రతిభను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాథమిక దశలోనే విద్యార్థులకు పటిష్ఠమైన పునాది ఏర్పడేలా 'ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ' (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. కృత్యాధార బోధనోపకరణాలను వినియోగిస్తూ, విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యమిస్తున్న ఉపాధ్యాయుల అంకితభావాన్ని కొనియాడారు. పాఠశాలలో అందుతున్న వసతులు, బోధనా విధానాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు.



# గిరిజన బిడ్డలకు రక్షణ కల్పించాలి

- **నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి**
- **ఊకె శిరీష ఘటనపై ఎస్ఎఫ్ ఐ–టీఏజీఎస్ నిరసన**




**భద్రాచలం, ఆగస్టు 31 (డిడి9 వార్త )**

గిరిజన మహిళలు, బాలికలపై దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ, టీఏజీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఊకె శిరీషపై జరిగిన దారుణ ఘటనను నిరసిస్తూ సోమవారం భద్రాచలంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఏజీఎస్ పట్టణ కార్యదర్శి కుంజ శ్రీను, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ మాట్లాడుతూ శిరీష ఘటనకు బాధ్యులైన నిందితులను వెంటనే అరెస్టు చేసి, సమగ్ర దర్యాప్తు అనంతరం కఠినంగా శిక్షించాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు గిరిజన మహిళలు, బాలికలకు ప్రత్యేక రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదవీ విరమణ కార్యక్రమం లో పాల్గొన్న ఉప సర్పంచ్ గాండ్ల సురేష్.



**మణుగూరు.ఆగస్టు 31 (డి డి 9వార్త)**

మణుగూరు సింగరేణి ఏరియా PK OC –2 గనిలో అసిస్టెంట్ సూపర్డెంట్ గా విధులు నిర్వహిస్తున్న పొందూరు మధుసూదనరావు గారు 39 సంవత్సరాలు సుదీర్ఘంగా సింగరేణిలో సంస్థలో సేవలందించి ఈరోజు పదవీ విరమణ పొందిన సందర్భంగా పి.వి కాలనీ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొని వారిని పుష్పగుచ్ఛం మరియు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు మరియు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గాండ్ల సురేష్ మాట్లాడుతూ, మధుసూదనరావు గారి విశ్రాంత జీవితమంతా సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండలం,సమితి సింగారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు AM చారీ, ఎండి యాకూబ్ అలీ, ఎల్ఐసి ఏజెంట్ ఎండి యాకూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# శిరీషకు న్యాయం చేయాలి

**నిందితుడిని కఠినంగా శిక్షించాలి.. కుటుంబానికి రూ.5 కోట్ల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి**

**ఆదివాసీ సమితి ప్రధాన కార్యదర్శి పాయం రవివర్మ**




**భద్రాచలం, ఆగస్టు 31( డిడి9 వార్త)**

హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి ఊకే శిరీష మృతికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని భద్రాచలం ఆదివాసీ సమితి ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ పాయం రవివర్మ డిమాండ్ చేశారు. శిరీష కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ డిమాండ్‌తో ఆదివాసీ సమితి ఆధ్వర్యంలో భద్రాచలంలో మానవహారం, భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాయం రవివర్మ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఉపాధి కోసం వెళ్లిన శిరీష మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు, ముఖ్యంగా గిరిజన మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.5 కోట్ల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలోని అర్హత కలిగిన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో వేగంగా విచారించి సత్వర న్యాయం చేయాలని, ఆసుపత్రి భద్రతా ప్రమాణాలపై కూడా విచారణ జరపాలని కోరారు. శిరీషకు న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూనెం కృష్ణ, పూనెం వీరభద్రం, పూనెం నాగేశ్వరరావు, గుండు శరత్, కల్లూరు జయబాబు, ఇరుప అనసూయ, కొండ సుధారాణి, కుంజా సంతోష్, కుంజ రమాదేవి, సోయం జోగారావు, కుంజా శ్రీను, వీసాల కృష్ణయ్య, ఇరప శ్రీను, వాసం వీరభద్రం, జీఎస్ శంకర్రావు, ఎం.బి. నర్సారెడ్డి, అలవాల రాజా, సాధనపల్లి సతీష్, శివ, కంగార చైతన్య, బండి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ యువతుల భద్రత.. ప్రభుత్వాల బాధ్యత



**చర్ల, ఆగష్టు 31 (డిడి 9 వార్త )**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆదివాసీ యువతి తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తూ అనుమానాస్పదస్థితి లో మృతి చెందిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, ఆమె మృతికి కారణమైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక డిమాండ్ చేసింది. ఈ ఘటన అత్యంత విషాదకరమైనదని, ఆదివాసీ యువతులు ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు వారి భద్రతపై ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలు ప్రత్యేక బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజు దొర అన్నారు. యువతిపై అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎలాంటి జాప్యం లేకుండా కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. యువతి మృతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా బాధ్యులను చేసి, చట్టం అనుమతించే అత్యంత కఠినమైన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించడంతో పాటు, కుటుంబంలో అర్హత ఉన్న ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని రాజు దొర డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయ సహాయం అందించి, కేసు దర్యాప్తును పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఆదివాసీ యువతుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రైవేట్ ఆసుపత్రులు, సంస్థల్లో పనిచేస్తున్న మహిళలకు సురక్షితమైన పని వాతావరణం కల్పించేలా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని వేదిక డిమాండ్ చేస్తుందన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక అండగా నిలుస్తుందని, అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనలు చేపడతామని ఆదివాసీ యువ నాయకులు పాయల కన్నారావు, నూపా కృష్ణ, కుంజా చంటి, శివ, ఆదివాసీ మహిళా జేఏసీ నాయకురాలు బీరబోయిన రాణి, ఇరప అపర్ణ తదితరులు తెలిపారు.

## గిరిజన దర్బార్ లో వచ్చిన ప్రతి విన్నపాన్ని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

### భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్



**భద్రాచలం, ఆగస్టు 31 (డిడి9 వార్త )**

గిరిజన దర్బార్ లో గిరిజనులు సమర్పించే ప్రతి అర్జీని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో ఏజెన్సీ ప్రాంతంలోని వివిధ గిరిజన గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి పీవో రాహుల్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో రాల్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి ఏమాత్రం తావివ్వకూడదని పీవో స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఇతర శాఖల పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కార స్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు సకాలంలో అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గిరిజన దర్బార్ కు వచ్చే ప్రతి విన్నపాన్ని కేవలం అర్జీగా కాకుండా గిరిజనుల జీవన సమస్యగా పరిగణించి బాధ్యతతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. సమస్య పరిష్కారమైన తర్వాతే అర్జీదారుడికి పూర్తి స్థాయి సేవ అందినట్లుగా భావించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ , ఎస్ డీసీ ట్రైబల్ వెల్ఫేర్ ఆనంద్ కుమార్ , డీడీ ట్రైబల్ వెల్ఫేర్ చందన, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్ , ఏపీవో పవర్ వేణు, ఎల్ టీఆర్ డీటీ మనిధర్ , పీవీటీజీ అధికారి గన్యా, ఏవో సున్నం రాంబాబు, జేడీఎం హరికృష్ణ పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో సత్వర పరిష్కారం చూపాలి: అదనపు కలెక్టర్ భుజంగరావు

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 31(డీడీ9 వార్త) :**

ప్రజల సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి 159 వినతులు వచ్చాయి. జిల్లాలోని మూలమూలల నుంచి తరలివచ్చిన బాధితులు తమ భూములు, పింఛన్లు, ఇతర సమస్యలపై అదనపు కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, ఏసీపీ శ్రీశైలంలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# "కార్మిక సంఘ నాయకుడే నా చావుకు కారణం" అంటూ మహిళ సెల్ఫీ వీడియో..

- **బాధితురాలి నివాసానికి వెళ్లి పరామర్శించిన ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.**

**మణుగూరు.ఆగస్టు 31(డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు సింగరేణి. "నా చావుకు మణుగూరు కార్మిక సంఘ నాయకుడు, ఆ కుటుంబమే కారణం" అంటూ మణుగూరు సింగరేణి హాస్పిటల్ లో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళ సోమవారం ఉదయం తన ఆవేదనను వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సెల్ఫీ వీడియోపై మణుగూరు ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి స్పందించారు. విషయం తెలుసుకున్న నాగెల్లి వెంటనే నర్స్ కాలనీలోని ఆమె నివాసం ఉంటున్న ఎం.సి. క్వార్టర్‌కు వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. ఆమె ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, ఆమె ఆవేదనను సానుభూతితో విన్నారు. ఈ సందర్భంగా నాగెల్లి మాట్లాడుతూ, ఎలాంటి సమస్య ఎదురైనా ఆత్మహత్య వంటి తీవ్ర నిర్ణయాలకు వెళ్లకుండా ధైర్యంగా సమస్యను ఎదుర్కోవాలని సూచించారు. బాధితురాలికి న్యాయం జరిగేలా సంబంధిత విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన స్థాయిలో సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్మిక కుటుంబాల్లో ఏర్పడే వ్యక్తిగత, కుటుంబ సమస్యలు పెద్దవిగా మారకుండా పరస్పర చర్చలు, సమన్వయంతో పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. బాధితురాలు తాను ఒంటరిగా ఉన్నాననే భావనకు లోనుకాకుండా, అవసరమైన సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని నాగెల్లి తెలిపారు. కార్మిక కాలనీలు సామాజిక కుటుంబాల వంటివి సింగరేణి సంస్థ నిర్మించిన కార్మిక వాడలు కేవలం ఇళ్లు ఉన్న ప్రదేశాలు మాత్రమే కాదని, వేలాది మంది కార్మిక కుటుంబాలు కలిసి జీవించే ఒక సామాజిక కుటుంబం అని నాగెల్లి పేర్కొన్నారు. గనుల్లో విధులు నిర్వహించే కార్మికులకు ఇప్పటికే పని ఒత్తిడి ఉంటుందని, ఇంటికి వచ్చిన తర్వాత కూడా ఇరుగు పొరుగు వారితో గొడవలు, వివాదాలు కొనసాగితే ఆ ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. దీనివల్ల కార్మికుడి పని సామర్థ్యంపై ప్రభావం పడటంతో పాటు సంస్థకు కూడా నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడవచ్చని తెలిపారు. కార్మికుడు ప్రశాంతమైన వాతావరణంలో ఉన్నప్పుడే విధులకు సమయానికి హాజరు కావడం, భద్రతా నియమాలను పాటించడం, విధులపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టడం సులభమవుతుందని నాగెల్లి అన్నారు. కాలనీల్లో నివసించే ఇరుగు పొరుగు వారు కుటుంబ సభ్యుల్లా పరస్పరం గౌరవించుకుంటూ, చిన్నచిన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అందరూ కలిసి సహకరిస్తే కార్మిక కాలనీలను ప్రశాంతమైన, ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దుకోవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిబిజికెయస్ నాయకులు సుద్దాల సంపత్ కుమార్, గుగులోత్ రమేష్ నాయక్ పాల్గొన్నారు.

# ఉకే.శిరీష పార్థివదేహంకి నివాళులు

- **పులామల వెసి నివాలులు అర్పించిన బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం...**
- **శిరీష ధాహాన సంస్కారలకు తన వంతు గా 5,000/-రూపాయలు కుటుంబ సభ్యులకు అంధజేసిన సోయం...**

**అశ్వరావుపేట:ఆగస్టు 31(డిడి 9 వార్త)**



మంచి ఉజ్జ్వల భవిష్యత్ ఉన్నా ఆదివాసి యువతి శిరీష హైదరాబాద్ కీరాతకం హత్య నన్ను కలిచివేసింధి సనా ఉల్లాఖాన్ హంతకుడిని వెంటనే ఎన్కౌంటర్ చేయాలి ప్రైమ్ కేర్ ప్రైవేట్ ఆసుపత్రి యజమాన్యం కుడా నిర్లక్ష్యం వేరసి నిండు ప్రాణం బలి ... ఆసుపత్రి యజమాన్యం 1కోటి రూపాయలు ఎక్స్‌గ్రేసియా భాధిత కుటుంబం కి ఇవ్వాలి...భారస నాయకులు సోయం వీరభద్రం డిమాండ్ఉ కే శిరీష కుటుంబం పరమర్శించి,ప్రగడ సానుభూతి తెలిపి మనో ధైర్యం నింపిన బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం చౌటిగూడెం కాలనీ గ్రామం లో ఉకే శిరీష పార్థివదేహం కి పులుమల వెసి నివాలులు అర్పించిన అనంతరం ఆదివాసి నాయకులుతో కలిసి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన బి.ఆర్.ఎస్. పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం ఈ సంధర్భంగా వారు మట్లాడుతు కడు పేద కుటుంబం నుండి ఓ ప్రైవేట్ ఆసుపత్రి లో నర్సుగా విధులు నిర్వర్తిస్తున్న శిరీష ఓ రోహింగ్యా సలా ఉల్లాఖాన్ అనే ఓ మానవ మృగం చేతి కిరాతకంగా హత్య చేయడం భాధాకారం...భాధితుడుని ఎన్కౌంటర్ చేయాలని...ప్రైమ్ కేర్ ఓ ప్రైవేట్ ఆసుపత్రి లో పర్యావేక్షణ లోపం ములంగా ధారునమైన సంఘటన జరిగినధి అని అన్నారు... శిరీష కుటుంబం కి ఆసుపత్రి యజమాన్యం 1కోటి రూపాయలు ఇవ్వలి అని కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల భద్రత కోసం దిశ ,నిర్భయ వంటి చట్టాలు తేసుకొని వచ్చిన అమలులో జప్యం జరుగుతుంధి ఘటన జరిగీన 24 గంటల్లో వెంటనే భాద్యుల పైన కఠినమైన శిక్ష చర్యలు తీసుకోనెల మార్పులు కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాలు చట్ట సవరణలు చేయాలి.

# ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయాలి

### ట్రైనీ కలెక్టర్ సురేష్ పామూరి

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 31(డీడీ9 వార్త) :**



గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసినప్పుడే ఉన్నత వైద్య సేవలపై భారం తగ్గుతుందని ట్రైనీ కలెక్టర్ సురేష్ పామూరి పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రాజశ్రీ అధ్యక్షతన వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రోగ్రామ్ అధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రైనీ కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల స్థాయి నుంచే విద్యార్థులకు ఆరోగ్యం, జీవనశైలి వ్యాధులు, క్యాన్సర్, ఊబకాయం నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. కాలేజీల్లో మారథాన్, రన్నింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాలని పిలుపునిచ్చారు. టీబీ నియంత్రణకు ప్రతి కుటుంబంతో పాటు డ్వాక్రా మహిళలు, బీడీ వర్కర్లకు వీఏవోలు, పంచాయతీ కార్యదర్శులు, మెప్మా సభ్యుల ద్వారా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. డిఆర్డీఏ, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని, వైద్య విద్యార్థుల భాగస్వామ్యంతో మండలాల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రచారం చేయాలని స్పష్టం చేశారు. వ్యాధి నిరోధక టీకాలను 100 శాతం పూర్తి చేయాలని, ప్రతిష్టత ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో డెంగీ ప్రబలకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాతా శిశు మరణాలు సంభవించకుండా పక్కా చర్యలు చేపట్టాలని, ఒకవేళ జరిగితే కారణాలను విశ్లేషించి పునరావృతం కాకుండా చూడాలన్నారు. వైద్య అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మానవతా దృక్పథం, సృజనాత్మకతతో ప్రజలకు సేవలు అందించాలని పిలుపునిచ్చారు.

# విద్య, వైద్య సమస్యలు పరిష్కరించాలి...

- **ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి**
- **సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా**

**భద్రాచలం, ఆగస్టు 31 డిడి9 వార్త**




విద్య, వైద్య రంగాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ , తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ కు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో జూన్ , జూలై నెలల్లో నిర్వహించిన సర్వేలో అనేక సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని, పట్టణంలోని పల్లె దవాఖానాల్లో కనీస వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి ని కొనసాగించాలని, వృద్ధాప్య, వితంతు పింఛన్లను రూ.4 వేలకు పెంచాలని, పింఛన్ దరఖాస్తు గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించాలని కోరారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంబీ నర్సారెడ్డి, బండారు శరత్ బాబు, వై. వెంకటరామారావు, డి. సీతాలక్ష్మి , పి. సంతోష్ కుమార్, ఇరప అనసూయ, కొప్పుల రవీందర్ పాల్గొన్నారు.

# శిరీష మృతిపై నిజాలు నిగ్గుతేల్చాలి..

- బాధ్యులెవరైనా కఠినంగా శిక్షించాలి – ఆదివాసీ నవ నిర్మాణ సేన..

**ఆగస్టు31 డిడి9 వార్త వెంకటాపురం.**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఉయిక శిరీష హైదరాబాద్‌లో నర్సుగా పనిచేస్తూ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడంపై ఆదివాసీ నవ నిర్మాణ సేన తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది.

శిరీష మృతికి సంబంధించిన ప్రతి కోణాన్ని సమగ్రంగా దర్యాప్తు చేసి అసలు వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సోమవారం సాయంత్రం వెంకటాపురం మండల కేంద్రంలో ఆదివాసీ నవ నిర్మాణ సేన ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. శిరీష మృతిపై ఎలాంటి అనుమానాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని, బాధ్యులెవరైనా ఉన్నట్లు తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ న్యాయం, అవసరమైన అండదండలు అందించాలని కోరారు. ర్యాలీలో ఆదివాసీ యువత, మహిళలు, గ్రామస్తులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిరీషకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం ఐదు నిమిషాలు మౌనం పాటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని ఆదివాసీ నవ నిర్మాణ సేన నాయకులు స్పష్టం చేశారు.

# పదవుల కోసం కాదు.. ప్రజల కోసమే పార్టీ






- బంగారు తెలంగాణ కాదు.. బహుజన తెలంగాణ కావాలి"
- "కన్నీళ్లు వస్తున్నాయి.. కానీ నేను పిరికిదాన్ని కాదు"
- పాంచజన్య సంకల్ప సభలో కవిత భావోద్వేగ ప్రసంగం
- సొంత గడ్డపై కన్నీటి పర్యంతమైన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు

**నిజామాబాద్,ఆగస్ట్ 31,(డిడి9 వార్త):**

సొంత గడ్డపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ ఏర్పాటు చేసిన నాలుగు నెలల అనంతరం నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె ప్రసంగిస్తూ పలుమార్లు కన్నీళ్లు పెట్టుకున్నారు. తన సొంత ప్రజలను కలుసుకోవడం ఆనందంగా ఉందని చెబుతూనే, కుటుంబంలో చోటుచేసుకున్న పరిణామాలను గుర్తుచేసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కన్నీళ్లు తన బలహీనత కాదని, ప్రజల కోసం తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. "సొంతూరుకు వచ్చాక ఆపుకుందామనుకున్న కన్నీళ్లు ఆగడం లేదు. ఆడబిడ్డకు బాధ కలిగితే కన్నీళ్లు వస్తాయి. అలాగని నేను పిరికిదాన్ని కాదు" అని కవిత అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు పోరాడారని, సుమారు 1,600 మంది ప్రాణత్యాగం చేశారని ఆమె గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడితే ప్రజల బతుకులు మారుతాయని ఆశించి ఉద్యమించామని, అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ప్రజల సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదని వ్యాఖ్యానించారు.

**ప్రజల కోసం కొత్త రాజకీయ శక్తి**

తనకు ఇప్పటికే ఎంపీ, ఎమ్మెల్సీ వంటి పదవులు లభించాయని, ఇక పదవుల కోసం రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం లేదని కవిత అన్నారు. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాలనే సంకల్పంతోనే కొత్త రాజకీయ శక్తిని నిర్మిస్తున్నానని చెప్పారు. "పదవుల కోసమే అయితే ఏ పార్టీలోకైనా వెళ్లొచ్చు. కానీ ప్రజలకు మంచి చేయాలనే పంతంతో ముందుకు వచ్చాను" అని ఆమె పేర్కొన్నారు. తెలంగాణలో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేందుకు కొత్త ఆలోచన, కొత్త శక్తి అవసరమని అన్నారు. బంగారు తెలంగాణ పేరుతో కొంతమందికే ప్రయోజనం కలిగిందని విమర్శిస్తూ, తన లక్ష్యం "బహుజన తెలంగాణ" అని స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్ పై విమర్శలు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా కవిత విమర్శలు చేశారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ ప్రజల ఆశలు పూర్తిగా నెరవేరలేదని వ్యాఖ్యానించారు. భారీ వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినా నిజామాబాద్ జిల్లాలోని రైతులకు ఆశించిన స్థాయిలో సాగునీరు అందలేదని అన్నారు. తనపై బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిలో పాత్ర ఉందంటూ వస్తున్న విమర్శలను ఆమె ఖండించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తాను తన కంపెనీని విక్రయించుకున్నానని పేర్కొన్నారు. అవినీతి వల్ల కొంతమంది మాత్రమే లబ్ధి పొందారని ఆరోపించారు.

**ఈడీ, సీబీఐ కేసులపై ఘాటు వ్యాఖ్యలు**

తనపై నమోదైన కేసులు, తీహార్ జైలు అనుభవాన్ని కూడా కవిత సభలో ప్రస్తావించారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని మొదటి నుంచే చెబుతూ వచ్చానని, నాలుగేళ్లపాటు ఈడీ, సీబీఐ విచారణలను ఎదుర్కొన్నా తన ధైర్యం సడలలేదని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావిస్తూ, తన వాదనలకు న్యాయపరమైన గుర్తింపు లభించిందని కవిత వ్యాఖ్యానించారు. తనను అన్యాయంగా జైల్లో పెట్టారని అప్పట్లో మాట్లాడిన నాయకులు ఆ తర్వాత ఎందుకు మౌనం వహించారో చెప్పాలని ప్రశ్నించారు.

**కుటుంబ పరిణామాలపై భావోద్వేగం**

కుటుంబంలో తనకు ఎదురైన పరిణామాలను గుర్తుచేసుకున్న కవిత తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. కష్టకాలంలో తనను అత్తమామలు కన్న కూతురిలా చూసుకున్నారని తెలిపారు. సొంత కుటుంబం తనను బయటకు పంపిన తీరుపై ఆవేదన వ్యక్తం చేస్తూ, తనను ఎందుకు దూరం చేశారో ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. అదే సమయంలో తనకు అండగా నిలిచిన నిజామాబాద్ ప్రజలను ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై కవిత తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో ఎన్ని అమలు చేశారో ప్రజలు ప్రశ్నించాలని అన్నారు. రైతు భరోసా, రైతుల సమస్యలు తదితర అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ నాయకులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. "ప్రతిపక్షం నిద్రపోతే మనం ఊరుకోవాలా?" అంటూ కవిత ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లాలోని బీఆర్ఎస్ నేతలు ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడం లేదని విమర్శించారు.

**ప్రశాంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు**

తన రాజకీయ జీవితంలో తనకు వ్యతిరేకంగా వ్యవహరించిన నేతలపై కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా ప్రశాంత్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనను, తన తండ్రిని రాజకీయంగా ఇబ్బంది పెట్టడంలో ఆయన పాత్ర ఉందని ఆరోపించారు. "హరీశ్‌రావు, సంతోష్‌రావులను క్షమిస్తానేమో కానీ ప్రశాంత్‌రెడ్డిని క్షమించను" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బాల్కొండలో ఆయనను ఓడిస్తామని అన్నారు. అయితే కవిత చేసిన ఈ ఆరోపణలపై సంబంధిత నేతల నుంచి స్పందన రావాల్సి ఉంది. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పైనా కవిత విమర్శలు చేశారు. మాధవ్‌నగర్ బ్రిడ్జి నిర్మాణం ఎందుకు ఆలస్యమవుతోందని ప్రశ్నించారు. ఏడేళ్లుగా నిర్మాణం పూర్తికాకపోవడంపై ఎంపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు అంశాన్ని కూడా ప్రస్తావిస్తూ, దాని ద్వారా రైతులకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం కలగలేదని విమర్శించారు.

**ఐదు అంశాలతో 'పాంచజన్య'**

తమ రాజకీయ ప్రస్థానానికి ఐదు కీలక అంశాలను ఆధారంగా చేసుకుని ముందుకు వెళ్తామని కవిత తెలిపారు. శ్రీకృష్ణుడి పాంచజన్య శంఖాన్ని స్ఫూర్తిగా తీసుకుని తమ సంకల్పాలకు ఆ పేరు పెట్టుకున్నామని వివరించారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. యువతకు పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు అందించే విధానాన్ని తీసుకురావాలని ప్రతిపాదించారు. సామాజిక న్యాయానికి తమ పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అన్ని కులాలు, వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలని, అగ్రవర్ణాల్లోని పేదల సంక్షేమాన్ని కూడా పట్టించుకోవాలని అన్నారు.

**భూమిలేని పేదలకు ఎకరం భూమి**

భూమిలేని అర్హత కలిగిన పేదలకు ఎకరం భూమి అందించే లక్ష్యంతో 'భూలక్ష్మి ' పథకాన్ని ప్రతిపాదిస్తున్నట్లు కవిత ప్రకటించారు. పేదలకు భూమి అంటే కేవలం ఆస్తి కాదని, గౌరవానికి ప్రతీక అని అన్నారు. బీడీ కార్మికుల పెన్షన్ సమస్య, బోధన్ షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ వంటి స్థానిక సమస్యలపై కూడా ఆమె మాట్లాడారు. అవసరమైతే కార్మికుల తరఫున ప్రత్యక్ష పోరాటం చేస్తానని ప్రకటించారు.

**ఐదు సీట్లపై గురి**

రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని కవిత స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలోని ఐదు స్థానాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి నియోజకవర్గంలో కొత్త యువ నాయకత్వాన్ని తయారు చేస్తామని, ప్రజల సమస్యలపై పనిచేసే "షాడో ఎమ్మెల్యేలను" సిద్ధం చేస్తామని తెలిపారు.

**కాంగ్రెస్‌పై పోరాటం.. పార్టీ నిర్మాణం**

ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూనే, మరోవైపు తెలంగాణ రక్షణ సేనను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తామని కవిత ప్రకటించారు. మైనార్టీల హక్కుల కోసం గొంతుకగా నిలుస్తామని, రైతులను ఇబ్బంది పెట్టే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చే యాప్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు. "కేసీఆర్ తెలంగాణ కోసం బయలుదేరినప్పుడు ప్రజలు ఆయన వెంట నిలిచారు. నేను బహుజన తెలంగాణ కోసం బయలుదేరుతున్నా.. మీ ఆశీర్వాదం కావాలి" అంటూ కవిత తన ప్రసంగాన్ని ముగించారు. నిజామాబాద్ గడ్డపై జరిగిన ఈ సభ ద్వారా తెలంగాణ రక్షణ సేన తన రాజకీయ ప్రస్థానాన్ని మరింత దూకుడుగా కొనసాగించనున్న సంకేతాలను కవిత ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే ఆ పార్టీకి తొలి రాజకీయ పరీక్షగా మారే అవకాశం కనిపిస్తోంది.





## జిల్లాలో 11 మంది హెడ్ కానిస్టేబుల్ లకు ఎస్ ఐలుగా పదోన్నతి

### అభినందించిన పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య




**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 31(డీడీ9 వార్త) :**

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 11 మంది హెడ్ కానిస్టేబుళ్లకు అసిస్టెంట్ సబ్ ఇన్ స్పెక్టర్ లుగా పదోన్నతులు లభించాయి. ఈ నేపథ్యంలో నూతనంగా పదోన్నతి పొందిన అధికారులందరూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత కొంతకాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న తమకు ప్రమోషన్లు లభించడం పట్ల పోలీసు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన ప్రతీ ఒక్కరికీ సీపీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో మరింత అంకితభావంతో, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ పదోన్నతులు పొందిన వారిలో నందిపేట సీఐ కార్యాలయ హెడ్ కానిస్టేబుల్ ఎస్.గంగాధర్ రావు, నిజామాబాద్ ఉమెన్ పోలీస్ స్టేషన్ కు చెందిన పి.రాజేశ్వర్, సీసీఎస్ పోలీస్ స్టేషన్ కు చెందిన పి.మోహన్, పీసీఆర్ కు చెందిన బి.జగదీశ్వర్, సీఎస్ బీకి చెందిన పి.చిన్న సాయిలు, డిచ్ పల్లి స్టేషన్ కు చెందిన జె.రాజశేఖర్, సిరికొండ స్టేషన్ కు చెందిన జి.రాజేందర్, నవీపేట్ స్టేషన్ కు చెందిన పి.సుదర్శన్, టౌన్–1 స్టేషన్ కు చెందిన కె.డేనియల్ భాస్కర్, టౌన్–2 స్టేషన్ కు చెందిన కె.సుంకన్న, వర్ని పోలీస్ స్టేషన్ కు చెందిన కె.మల్లేశంలు ఉన్నారు.

## పదవీ విరమణ చేసిన పోలీస్ సిబ్బందికి ఘన వీడ్కోలు

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 31(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘ కాలం సేవలందించి పదవీ విరమణ పొందిన సిబ్బందికి సీపీ కార్యాలయంలో సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పాల్గొని విశ్రాంత ఉద్యోగులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు, పదవీ విరమణ పత్రాలను అందజేశారు.పదవీ విరమణ పొందిన వారిలో స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహించిన ఏఎస్ఐ కె. గంగాధర్ గౌడ్, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఆర్ఎస్ఐ అమీరుద్దీన్, ఏఆర్ కానిస్టేబుల్ కె.అశోక్ ఉన్నారు. ఈ సందర్భంగా సీపీ పి.సాయి చైతన్య మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో తీవ్ర పనివత్తిడి ఉన్నప్పటికీ ఎలాంటి రిమార్కులు లేకుండా సుదీర్ఘ కాలం సేవలుందించి పదవీ విరమణ చేయడం అభినందనీయమన్నారు. విశ్రాంత జీవితంలో ఏ అవసరం వచ్చినా పోలీస్ డిపార్ట్‌మెంట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏసీపీ శ్రీరాములు, ఆఫీస్ సూపరింటెండెంట్లు ఎ. జగతి, టి. వనమాల, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఆర్ఐలు శేఖర్ బాబు, సతీష్‌తో పాటు సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సుదర్శన్ నగర్ తండాలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 31(డీడీ9 వార్త) :**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ కొందరివాడు కాదని, సమాజంలోని అందరివాడని సుదర్శన్ నగర్ తండా సర్పంచ్ వసుంధర్ అన్నారు. తండా ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విగ్రహ దాత అయిన సర్పంచ్ వసుంధర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ మహనీయుడు అందించిన రాజ్యాంగం, ఆయన చేసిన పోరాటాల ఫలితంగానే నేడు అన్ని వర్గాల ప్రజలు సమాజంలో హక్కులు, అవకాశాలు పొందుతూ అభివృద్ధి పథంలో పయనిస్తున్నారని కొనియాడారు. మహనీయుడి త్యాగాలను స్మరించుకుంటూ, ఆయనకు సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ విగ్రహావిష్కరణ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ దళిత సీనియర్ నాయకుడు గడాల ప్రసాద్, జగిత్యాల్ సర్పంచ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సంటిలతతో పాటు ప్రముఖ నాయకులు జై జై నర్సయ్య, యొనా రతన్, చెప్పాల గణేష్, తెడ్డు అశోక్, రాజేందర్, అనంతరావు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్ర కారాగారంలో భద్రత పటిష్టం చేయాలి: సీపీ సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 31(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ కేంద్ర కారాగారంలో భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేసేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సోమవారం సునిశిత తనిఖీలు నిర్వహించారు. కారాగారంలో నిర్వహించిన సెక్యూరిటీ రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్న ఆయన, భద్రతా చర్యలతో పాటు సీసీ కెమెరాల నిఘా, ప్రహరీ గోడల భద్రత, హాస్పిటల్, డీ–అడిక్షన్ సెంటర్ల పనితీరుపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కేంద్ర కారాగారం అత్యంత కీలకమైన భద్రతా ప్రదేశమని, అక్కడ పనిచేసే ప్రతి అధికారి, సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రవేశ–నిష్క్రమణ మార్గాలు, కారాగార పరిసరాలు నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చూడాలన్నారు. కారాగార ప్రహరీ గోడ వద్ద నిఘాను నిరంతరం కొనసాగించాలని, ఎప్పటికప్పుడు లోపాలను సరిదిద్దుకోవాలని ఆదేశించారు. అనంతరం జైలు ఆసుపత్రి, డీ–అడిక్షన్ సెంటర్లను సందర్శించి ఖైదీలకు అందుతున్న వైద్య సేవలు, భద్రతా పర్యవేక్షణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జైలు అధికారులు, పోలీస్ శాఖ, భద్రతా సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ పి. అశోక్ కుమార్, డిప్యూటీ జైలర్ మన్మధరావు, జైలర్లు తిరుమలరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ (అడ్మిన్) ధరణి కుమార్, మెడికల్ ఆఫీసర్ సామ్రాట్, 6–టౌన్ ఎస్ఐ కే. సందీప్ తదితరులు పాల్గొన్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518